

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 16-02-2025 | సంపుటి - 21 | సంచిక -298 | రూ : 4 | పేజీలు: 8



# జెన్‌కో కొత్త ప్లాంట్‌కు భారీ వ్యయం

- 2,400 మెగావాట్ల థర్మల్ కేంద్రాన్ని ఎన్టీపీసీ నిర్మించి ఇస్తామంటే అప్పట్లో వద్దన్న ప్రభుత్వం
- ఇప్పుడు రూ.10,664 కోట్ల అప్పు తెచ్చి కట్టేందుకు డీపీఆర్ సిద్ధం చేసిన విద్యుత్ సంస్థ

హైదరాబాద్: కొత్త థర్మల్ విద్యుత్కేంద్రాల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి భిన్నంగా విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణకు ప్రత్యేకంగా రామగుండంలో 2,400 మెగావాట్ల ప్లాంటును సొంత ఖర్చుతో కట్టిస్తామని ఎన్టీపీసీ ముందుకు రాగా గతేడాది రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించింది. ఇప్పుడు అదే రామగుండంలో ఎన్టీపీసీ చెప్పినదానికన్నా అధిక వ్యయానికి 800 మెగావాట్ల థర్మల్ కేంద్రం నిర్మించేందుకు జెన్‌కో పాలకమండలి పచ్చజెండా ఊపింది. ఈ ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి పంపుతోంది.

**అందుకే కొత్త థర్మల్ కేంద్రం**

రామగుండంలో 50 ఏళ్ల క్రితం నాటి 60 మెగావాట్ల థర్మల్ కేంద్రానికి కాలం తీరడంతో గత జూన్‌లో జెన్‌కో మూసివేసింది. అక్కడ పనిచేసే 300 మందికి పైగా ఉద్యోగులకు 8 నెలల నుంచి ఖాళీగా కూర్చోబెట్టి నెలనెలా జీతభత్యాలను చెల్లిస్తోంది. పాత ప్లాంటుకు 300 ఎకరాలకు పైగా స్థలం అందుబాటులో ఉంది. దానిని తమకిస్తే సొంత ఖర్చుతో 800 మెగావాట్ల కొత్త థర్మల్ కేంద్రం నిర్మించి రాష్ట్రానికి కరెంటు సరఫరా చేస్తామని సింగరేణి ముందుకొచ్చింది. జెన్‌కో ప్లాంటు స్థలాన్ని సింగరేణికి ఎలా ఇస్తారంటూ విద్యుత్ ఉద్యోగులు అభ్యంతరం తెలిపారు. దీంతో రూ.13,331 కోట్ల వ్యయంతో అదే స్థలంలో 800 మెగావాట్ల థర్మల్ కేంద్రం స్వయంగా నిర్మించేందుకు వీలుగా జెన్‌కో డీపీఆర్‌ను రూపొందించింది. జెన్‌కో పాలకమండలి దానిని తాజాగా ఆమోదించింది. ఇందులో 80 శాతం(రూ.10,664 కోట్ల) సొమ్మును ఆర్థిక సంస్థల నుంచి అప్పులుగా తెచ్చుకుంటేనే నిర్మాణం సాధ్యమని ప్రభుత్వ అనుమతి అడుగుతోంది. అంటే మెగావాట్‌కు సగటున రూ.16.60 కోట్ల పెట్టుబడి అవసరం. ఇంతవరకూ దేశంలో అంత పెట్టుబడి పెట్టి నిర్మించిన దాఖలాలు లేవు. నల్గొండ జిల్లా

తరువాయి 2లో

## దిల్లీ పరిస్థితి...

# హైదరాబాద్‌కు రాకూడదు

- గ్రీన్‌సిటీగా మార్చేందుకు తగిన నిర్ణయాలు
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

మాదాపూర్ : కాలుష్యం పెరిగి దిల్లీ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. అలాంటి పరిస్థితి హైదరాబాద్‌కు రాకూడదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. హైదరాబాద్‌ను గ్రీన్‌సిటీగా మార్చేందుకు ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలను తీసుకుంటుందని చెప్పారు. ఆదాయం కంటే నగర ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి ప్రధానమన్నారు. శనివారం మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ), ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'గ్రీన్ తెలంగాణ సమ్మిట్ 2025'కు భట్టి విక్రమార్క ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దడంలో భాగంగా ఎలక్ట్రిక్ బస్సులు తీసుకొస్తున్నామన్నారు. ఈవీల వినియోగాన్ని పెంచేందుకు రిజిస్ట్రేషన్ ఛార్జీలు తగ్గించేందుకూ వెనుకాడలేదని చెప్పారు. ప్రపంచ కేంద్రంగా ఫ్యూచర్‌సిటీని తీర్చిదిద్దుతామన్నారు. మూసీ పునరుజ్జీవం రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయి అని, ఈ నదిలో పరిశుభ్రమైన నీరుపారించి మూసీని

తరువాయి 2లో



# మావోయిస్టులపై టెక్ యుద్ధం

- రాత్రిపూట చూడగలిగే పరికరాలు
- డ్రోన్ల వినియోగం.. తుపాకులకు సైలెన్సర్లు

2లో







2లో

## మహిళలు, చిన్నారులపై నేరాల నియంత్రణకు..ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు

## ఇప్పుడా సమయం వచ్చింది.. మనం సిద్ధం కావాలి : జెలెన్ స్కీ

యూరోపియన్ యూనియన్‌కు సైనిక కూటమిని ఏర్పాటు చేసుకునే సమయం వచ్చిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అన్నారు. రష్యాతో ఉక్రెయిన్ చేస్తున్న యుద్ధం తమ శక్తిని రుజువు చేస్తోందని పేర్కొన్నారు. ఈయూ సాయుధ దళాలను ఏర్పాటు చేసుకోవడానికి సమయం వచ్చిందని తాను బలంగా నమ్ముతున్నానని తెలిపారు. యుద్ధాన్ని ముగించడానికి రష్యా ముందుకు రావట్లేదని

తరువాయి 2లో



## ఆన్‌లైన్ బూచాడి

# ఆట కట్టించండిలా!



- పిల్లల్లో వ్యసనంగా మారుతున్న గేమింగ్
- ప్రపంచవ్యాప్తంగా 10-19 ఏళ్ల పిల్లల్లో 1.3 శాతం మందిలో..
- భారత్‌లో అలాంటివారు 19.9 శాతం మంది
- గేమింగ్ కన్సోల్స్‌లో పేరెంటల్ కంట్రోల్ వినియోగించాలంటున్న టీజీసీఎస్‌బీ

హైదరాబాద్ అంబర్‌పేటకు చెందిన ఓ ఇంటర్ విద్యార్థి(16) ఆన్‌లైన్ ఆటలకు అలవాటుపడ్డాడు. తర్వాత బానిసగా మారాడు. తొలుత తన తాత సెల్ ఫోన్‌లో రూ.1,500 వెచ్చించి గేమ్‌లు ఆడిన అతడు.. తర్వాత తల్లి

తరువాయి 2లో

## న్యూదిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట.. 15 మంది మృతి

- కుంభమేళా రద్దీతో దుర్ఘటన
- ప్రధాని మోదీ సంతాపం


దిల్లీ: కుంభమేళాకు వెళ్లే ప్రయాణికులు పోటెత్తడంతో శనివారం రాత్రి న్యూదిల్లీ రైల్వే స్టేషన్లో తొక్కిసలాట జరిగి 15 మంది మరణించారు. పలువురు గాయపడ్డారు. మృతుల్లో 10 మంది మహిళలు, ముగ్గురు చిన్నారులున్నారు. 14, 15 ప్లాట్ ఫాంలపై ఈ దుర్ఘటన జరిగింది. ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అయితే మృతులపై రైల్వేశాఖ అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. ఘటనపై మాత్రం అత్యున్నత స్థాయి విచారణకు ఆదేశించింది. తొక్కిసలాటలో మరణాలు చోటుచేసుకున్నట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ధ్రువీకరించారు. తొక్కిసలాట

తరువాయి 2లో



## మాజానికి తిరిగిస్తేనే

# జీవితానికి సార్థకత



- ఎన్టీఆర్ స్ఫూర్తితోనే అందరం ముందుకెళ్లాలి
- తలసీమియా చిన్నారులకు అండగా నిలిచిన అందరికీ సెల్యూట్
- 'యుఫోరియా మ్యూజికల్ నైట్'లో ముఖ్యమంత్రి

**చంద్రబాబు**

అమరావతి: 'సమాజం వల్ల పైకి వచ్చిన ప్రతి ఒక్కరూ.. సమాజానికి ఎంతోకొంత తిరిగి ఇవ్వాలి. పేదరికం, ఆరోగ్య, విద్యా సమస్యలున్నాయి. సంపాదనలో కొంతభాగం సేవా కార్యక్రమాలకు వెచ్చించి జీవితాలను సార్థకం చేసుకోవాలి. ఎక్కడ

తరువాయి 2లో

# ఢిల్లీ పరిస్థితి హైదరాబాద్‌కు రాకూడదు

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌కు ఒక వరంలా మారుస్తామని చెప్పారు. బిల్డర్లు, రియల్ ఎస్టేట్ డెవలపర్లు సంపద సృష్టికర్తలని, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములని పేర్కొన్నారు. బిల్డర్లను ఇబ్బంది పెట్టే నిర్ణయాలు తీసుకోబోమని చెప్పారు. ఐజీబీసీ నేషనల్ వైస్‌ఛైర్మన్ సి.శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీలు ఇవ్వకపోయినా హరిత భవనాల నిర్మాణంలో దేశంలో తెలంగాణ ఐదో స్థానంలో ఉందన్నారు. హరిత భవనాలు చేపట్టే వారికి రాయితీలు కల్పిస్తే దేశంలో మొదటి స్థానానికి చేరుకుంటుందని చెప్పారు. ఇందుకు డెవలప్‌మెంట్, ఇంపాక్ట్ ఛార్జీలు తగ్గించాలని కోరారు. అనంతరం ఐజీబీసీలో వెయ్యి ప్రాజెక్టులు నమోదైన సందర్భంగా రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఫ్యూచర్‌సిటీని నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దేందుకు టీజీఐఐసీ, ఐజీబీసీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఒప్పంద పత్రాలపై టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, ఐజీబీసీ నేషనల్ వైస్‌ఛైర్మన్ శేఖర్‌రెడ్డి సంతకాలు చేశారు. కార్యక్రమంలో క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సీఐఐ సదరన్ రీజియన్ మాజీ ఛైర్మన్ అనిల్‌కుమార్, ఐజీబీసీ హైదరాబాద్ ఛాప్టర్ ఛైర్మన్ ఏఆర్ శ్రీనివాసమూర్తి, సీఐఐ గ్రీన్ బిజినెస్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఎస్.వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ బూచాడి ఆట కట్టించండిలా!

(మొదటిపేజీ తరువాయి)

బ్యాంకు ఖాతా నుంచి ఆన్‌లైన్‌లో చెల్లింపులు మొదలెట్టాడు. ఓసారి ఆమె నగదు ఉపసంహరణ నిమిత్తం బ్యాంకుకు వెళ్లగా.. రూ.27 లక్షల సొమ్ము విత్‌డ్రా అయినట్లు తెలియడంతో హతాశురాలైంది. తన పేరిటే ఉన్న మరో బ్యాంకు ఖాతాను తనిఖీ చేయగా అందులోనూ రూ.9 లక్షలు మాయమయ్యాయి. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించగా బాలుడి నిర్వాకం బయటపడింది. సెల్‌ఫోన్లు, పర్సనల్ కంప్యూటర్లు, గేమింగ్ కన్సోల్స్ ప్లాట్‌ఫామ్‌లలోని ఆన్‌లైన్ ఆటలు పలువురు పిల్లలను వ్యసనపరులుగా, వాటికి బానిసలుగా మారుస్తున్నాయి. ఆటలు కొనాలంటూ గేమింగ్ కంపెనీలు పిల్లలపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఇది వారిలో మానసిక సమస్యలకు, తల్లిదండ్రుల సొమ్మును దొంగచాటుగా ఆన్‌లైన్ ఆటలకు ఊడ్చేసే పరిస్థితికి దారితీస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 1019 ఏళ్ల వయసు పిల్లల్లో 1.3% మంది ఆన్‌లైన్ ఆటలకు బానిసలుగా మారగా.. భారత్‌లో అలాంటివారు 19.9 శాతం మంది ఉన్నట్లు ఇటీవల ఓ పరిశోధనలో వెల్లడైంది.

* ఇలాంటి సందర్భాల్లో తల్లిదండ్రులు అప్రమత్తం కావాల్సిందే..
* పిల్లలు తమ ఆన్‌లైన్ కార్యకలాపాల గురించి గోప్యత పాటించినప్పుడు
* తల్లిదండ్రులు తమ వద్దకు వచ్చిన వెంటనే స్క్రీన్‌లను మార్చినప్పుడు
* వారు సామాజిక మాధ్యమాల్లో ఎక్కువ సమయం గడుపుతున్నప్పుడు
* వారి ఎలక్ట్రానిక్ ఉపకరణాల్లో కొత్త ఫోన్ నంబర్లు లేదా ఈమెయిల్‌లు విపరీతంగా పెరిగినప్పుడు
* **గేమింగ్ కన్సోల్స్‌పై నిఘా ఇలా..**

గేమింగ్ కన్సోల్స్‌లో పేరెంటల్ కంట్రోల్ (తల్లిదండ్రుల నియంత్రణ) లను యాక్టివేట్ చేయడం ద్వారా పిల్లల ఆన్‌లైన్ గేమింగ్ కార్యకలాపాలను నిరంతరం పర్యవేక్షించే అవకాశముంది. ప్రముఖ గేమింగ్ కన్సోల్స్ అయిన ప్లే స్టేషన్, నిన్టెండో స్విచ్, ఎక్స్ బాక్స్‌లలో పేరెంటల్ కంట్రోల్‌లను యాక్టివేట్ చేయడంపై తల్లిదండ్రులకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తోంది.

# మావోయిస్టులపై టెక్ యుద్ధం

హైదరాబాద్: భద్రతా బలగాల టెక్నాలజీ దెబ్బకి మావోయిస్టులు విలవిల్లాడుతున్నారు. సైలెన్సర్లు అమర్చిన తుపాకులు, రాత్రిపూట కూడా చూడగలిగే పరికరాలు, డ్రోన్, ఉపగ్రహ ఛాయాచిత్రాలు.. ఇలా అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అంతా వాడుతున్నారు. దీంతో తమ ఉనికి కాపాడుకునే మార్గం తెలియక మావోయిస్టులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు మూడు దశాబ్దాలపాటు మావోయిస్టులు ఆధిపత్యం చెలాయించారు. ఇక్కడి భద్రతా బలగాలు పట్టు బిగించడంతో ఛత్తీస్‌గఢ్‌లోని అబూజ్‌మడ్‌కు తరలివెళ్లారు. దేశవ్యాప్తంగా ఉన్న మావోయిస్టు పార్టీ అగ్రనేతలంతా క్రమంగా అక్కడికే చేరుకొని ఉద్యమం నడిపించడం మొదలుపెట్టారు. దట్టమైన అరణ్యం, ఎత్తయిన కొండలు, కాలిబాట కూడా లేకపోవడంతో భద్రతా బలగాల కూంబింగ్‌కు అవకాశం ఉండేది కాదు. దీంతో కొన్నేళ్లపాటు ఇక్కడి నుంచే కార్యకలాపాలు సాగించారు.

**డ్రోన్ల కీలకపాత్ర**

కొంతకాలంగా అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో భద్రతా బలగాలు క్లిష్టమైన భౌగోళిక పరిస్థితులకు విరుగుడు కనుక్కున్నాయి. ముఖ్యంగా డ్రోన్ల వినియోగం ఈ పోరాటంలో కీలకపాత్ర పోషిస్తోంది. వాస్తవానికి 2011లోనే ఏపీ పోలీసులు డ్రోన్ విమానాన్ని లీజుకు తీసుకున్నారు. రాజమహేంద్రవరం కేంద్రంగా చేసుకొని ఆంధ్ర, ఒడిశా సరిహద్దు దండకారణ్యం ప్రాంతాలను ఆకాశం నుంచి చిత్రీకరించి మావోయిస్టుల ఉనికి కనుగొనేవారు. అయితే ఈ డ్రోన్ ఆయా ప్రాంతాల మీద ఎగిరిన తర్వాత దాని తాలూకా చిత్రాలు రావడానికి 48 గంటలు పట్టేది. ఈలోపు మావోయిస్టులు అక్కడ నుంచి వెళ్లిపోయేవారు. ప్రస్తుత డ్రోన్లు పైన ఎగురుతూ అప్పటికప్పుడు చిత్రాలు తీసి పంపిస్తున్నాయి. మావోయిస్టులు ఎంతమంది ఉన్నారు, ఎటువెళ్తున్నారు వంటి సమాచారం పక్కాగా తెలిసిపోతోంది. దీనికి తోడు మావోయిస్టులు ఉన్నట్లు అనుమానిస్తున్న ప్రాంతాలను ఉపగ్రహాల ద్వారా చిత్రీకరిస్తున్నారు. దాడి చేస్తే పారిపోవడానికి అవకాశం ఉన్న మార్గాలను కూడా ముందే ఊహించి అటువైపు నుంచి కూడా విరుచుకుపడుతున్నారు. మరోవైపు దాడుల్లోనూ సాంకేతిక పరిజ్ఞానం వాడుతున్నారు. అడవుల్లో ఎక్కువ దూరం నడిచి, కొండలు ఎక్కిదిగాలంటే బలగాలు త్వరగా అలసిపోతాయి. దీన్ని పరిష్కరించేందుకు ఎంఐ 17 వంటి ట్రూప్ క్యారియర్ హెలికాప్టర్లలో వారిని తరలిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఈ మధ్యనే ఏకే47 తుపాకుల కోసం పెద్దసంఖ్యలో సైలెన్సర్లు కొనుగోలు చేశారు. 40 ఎంఎం మల్టీ గ్రనేడ్ లాంచర్లనూ కొనుగోలు చేశారు. దీని ద్వారా 400 మీటర్ల వరకూ గ్రనేడ్‌ను ప్రయోగించవచ్చు. ఇది పేలితే 6 మీటర్ల చదరపు వైశాల్యంలో ఏమీ మిగలదు. నైట్ విజన్ బైనాక్యులర్స్ సైతం భారీగా వినియోగిస్తున్నారు. వీటి ద్వారా చిమ్మచీకట్లో చూడగలగడమే కాదు ఎదురుదాడికి దిగడానికి కూడా అవకాశం ఉంటుంది.

# సమాజానికి తిరిగిస్తేనే.. జీవితానికి సార్థకత

(మొదటిపేజీ తరువాయి)

అవసరముంటే.. అక్కడ ఎన్టీఆర్ ఉండేవారు. అవనిగడ్డలో తుపానొస్తే వచ్చారు. రాయలసీమకు కరువొస్తే వచ్చారు.. జోలెపట్టారు. బాధితులను ఆదుకున్నారు. ఆయన స్ఫూర్తితోనే అందరం ముందుకెళ్లాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. తలసీమియా బాధిత చిన్నారుల కోసం ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడలోని ఇందిరాగాంధీ క్రీడామైదానంలో యుఫోరియా మ్యూజికల్ నైట్‌ను శనివారం రాత్రి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చంద్రబాబు మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 250 మంది తలసీమియా బాధిత చిన్నారులకు ఇప్పటికే వైద్యసాయం అందిస్తున్నారన్నారు. మరింతమందిని ఆదుకునేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. 'ఓ మంచి కార్యక్రమానికి వెన్నుదన్నుగా నిలిచిన విజయవాడ వాసులకు సెల్యూట్ చేస్తున్నాను. శభాష్ విజయవాడ' అంటూ చంద్రబాబు కొనియాడారు. 'క్యాన్సర్‌తో బసవతారకం చనిపోతే.. బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిని ఆయన ఏర్పాటుచేశారు. అదిప్పుడు ఎంతోమందికి వైద్య సేవలందిస్తోంది. ఫ్యాక్షన్ గొడవలు, ప్రమాదాల్లో తెలుగుదేశం కుటుంబసభ్యులు చనిపోతే కుటుంబాలు రోడ్డున పడకూడదనే.. ఎన్టీఆర్ మెమోరియల్ స్కూల్‌ను పెట్టి వారిని ఆదుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఆరోగ్యం, విద్య, విపత్తుసాయం, నైపుణ్య శిక్షణ, మహిళా సాధికారత లాంటి కార్యక్రమాలతో ట్రస్ట్ సేవలు విస్తరించాం. తెలుగుజాతికి సేవ చేయాలనుకునే ప్రవాసాంధ్రుల సాయంతో నాంది ఫౌండేషన్ పెట్టి.. డాక్టర్ రెడ్డిని ఛైర్మన్‌గా పెట్టాం. ఆయన తర్వాత ఆనంద్ మహీంద్రకు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం నాంది ఫౌండేషన్ జాతీయస్థాయి ఎన్జీవోగా ఎదిగింది' అని చంద్రబాబు పేర్కొన్నారు.

* **తెలుగు జాతి ఉన్నంతవరకూ ఉంటాయి**

తల్లిపేరుతో ఏర్పాటుచేసిన బసవతారకం ఆస్పత్రి ద్వారా బాలకృష్ణ, తండ్రి పేరుతో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా భువనేశ్వరి సేవలు అందించడం చూసి తాను గర్వపడుతున్నానని చంద్రబాబు అన్నారు. 'తెలుగుజాతి ఉన్నంతవరకూ.. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ఉంటాయి. ఒక్క రూపాయి తీసుకోకుండా ట్రస్ట్‌కు సాయం చేస్తానని.. సంగీత దర్శకుడు తమన్ ముందుకు రావడాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను' అని చంద్రబాబు పేర్కొన్నారు.

* **మ్యూజికల్ నైట్‌లో వేదికపైనుంచి అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు**
* **పవన్ కల్యాణ్ రూ.50లక్షల విరాళం**


పవన్ కల్యాణ్ రూ.లక్ష టిక్కెట్ తీసుకోకుండా.. రూ.50లక్షలు ట్రస్ట్‌కు విరాళంగా ఇచ్చారంటూ చంద్రబాబు నవ్వుతూ తెలిపారు. ఆయనలాంటి గొప్ప మనసు అందరికీ ఉండాలన్నారు. 'నా కుటుంబసభ్యులు అటు హెరిటేజ్ కంపెనీని, ఇటు ట్రస్ట్‌ను బ్రహ్మాండంగా నడిపిస్తున్నారు. చివరికి నన్ను కూడా రూ.లక్ష టికెట్ తీసుకున్నాకే ఈ కార్యక్రమానికి అనుమతించారు' అని పేర్కొన్నారు.

* **ఎన్టీఆర్ లాగే.. భువనేశ్వరి మొండిఘటం**

'హెరిటేజ్‌నే కాదు.. ఎన్టీఆర్ ట్రస్ట్‌నూ అంతే గొప్పగా నడిపించే శక్తి భువనేశ్వరికి ఆమె తండ్రి నుంచి వచ్చిందని అర్థమైంది. ఎన్టీఆర్‌లాగే భువనేశ్వరి కూడా మొండిఘటం..' అంటూ చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## మైత్రి సివిల్ కన్స్ట్రక్షన్ లిజనింగ్ వర్క్స్ ఆఫీసు ప్రారంభం

కూకట్ పల్లి , (ప్రజాస్ఫూర్తి) : ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలో దాసరి రాహుల్ ప్రదీప్ బుల్లెట్ రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మైత్రి కన్స్ట్రక్షన్స్ లిజనింగ్ వర్క్స్ ఆఫీస్ ను శనివారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి ప్రారంభించారు. వారిరువురిని మైత్రి కన్స్ట్రక్షన్ యాజమాన్యం శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టులుగా సమాజ శ్రేయస్సు కై పనిచేస్తూ మరొక అడుగు ముందుకు వేస్తూ కన్స్ట్రక్షన్స్ లిజనింగ్ వర్క్స్ ఆఫీసును ప్రారంభించి, సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో కన్స్ట్రక్షన్స్ లోన్లు ఇప్పించి మరింత ముందుకు



సాగాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఎల్లమ్మబండ ప్రాంతాన్ని ఎంచుకొని ఇలాంటి ఆఫీసు ఓపెన్ చేయడం సంతోషకరమని, ఆఫీస్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రేయోభిలాషి తెల్ల హరికృష్ణ, ఆల్విన్ కాలనీ డివిజన్ కి సంబంధించిన వివిధ రాజకీయ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, బస్తీ వాసులు, మహిళా నాయకురాలు, మిత్రులు శ్రేయోభిలాషులు, జర్నలిస్టు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

**మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను కలిసిన సట్టు తిరుమలేష్**



రాజపేట, ప్రజాస్ఫూర్తి : రాజపేట మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, మండల సీనియర్ నాయకులు, ప్రతినిధులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఎర్రబెల్లి ఫామ్ హౌస్ లో కలిశారు. ఈ సందర్భంగా ఆయన కొద్దిసేపు రాజపేట మండల టిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో మాట్లాడారు. పార్టీని బలోపేతం చేస్తూ, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిత్యం ప్రజల మధ్యలో ఉంటున్న సట్టు తిరుమలేష్ ను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శాలువాతో సత్కరించి అభినందించారు.

## జెన్‌కో కొత్త ప్లాంట్‌కు భారీ వ్యయం

(మొదటిపేజీ తరువాయి)

దామెరచర్లలో నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ కేంద్రం నిర్మాణానికి సగటున మెగావాట్‌కు పెడుతున్న వ్యయం రూ.9 కోట్లు. అక్కడ ఉత్పత్తయ్యే కరెంటు యూనిట్‌కు రూ.5.60 దాకా చెల్లించి రాష్ట్ర డిస్కంలు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఈ కొత్త థర్మల్ కేంద్రం చేపట్టడానికి ప్రభుత్వం అంగీకరిస్తే ఐదేళ్ల తరవాత యూనిట్ కరెంటుకు రూ.9 వరకూ చెల్లించి డిస్కంలు కొనాల్సి వస్తుందని విద్యుత్ ఇంజినీర్లు తెలిపారు. నిర్మాణంలో ఐదేళ్లకు మించి జాప్యం జరిగితే పూర్తయ్యేనాటికి వ్యయం మరింత పెరిగే సూచనలున్నాయి. మరోపక్క రాష్ట్రంలో 2030 నాటికి 20 వేల మెగావాట్ల హరిత ఇంధన (గ్రీన్ ఎనర్జీ) ఉత్పత్తిని అదనంగా సాధిస్తామని ఇటీవల విడుదల చేసిన రాష్ట్ర ఇంధన విధాన పత్రంలో ప్రభుత్వం తెలిపింది. ఈ పరిస్థితుల్లో కొత్త థర్మల్ ప్లాంట్‌కు ప్రభుత్వం అనుమతిస్తుందా లేదా అనేది కీలకంగా మారింది.

## న్యూదిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట.. 15 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)

నేపథ్యంలో రద్దీని నివారించేందుకు నాలుగు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశామని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. అనూహ్య రద్దీ కారణంగా తొక్కిసలాట జరిగినట్లు వెల్లడించారు. 14వ నంబరు ప్లాట్‌ఫాంపై ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ నిలిచి ఉండడంతో మహా కుంభమేళాకు వెళ్లే భక్తులు అక్కడకు చేరుకున్నారు. స్వతంత్ర సేనాని ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ రాజధాని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆలస్యం కావడంతో వాటి కోసం వచ్చిన ప్రయాణికులు అదే సమయంలో 12, 13, 14 నంబరు ప్లాట్‌ఫాంలపై ఉన్నారు. దీంతో ఒక్కసారిగా అక్కడ రద్దీ పెరిగిపోయి తొక్కిసలాటకు దారితీసినట్లు భావిస్తున్నారు.

## ఇప్పుడా సమయం వచ్చింది.. మనం సిద్ధం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. ఇరుదేశాల మధ్య జరుగుతున్న పోరుకు ముగింపు పలికే ఆలోచన ఆ దేశానికి ఉన్నట్లు లేదని అసహనం వ్యక్తం చేశారు. అమెరికా సైనిక సాయం చేయకుండా తమ దేశం మనుగడ సాగించడం అసాధ్యమని.. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో అగ్రదేశం తమకు సైనిక సహాయాన్ని ఆపివేసినా ఆశ్చర్యపోనక్కరలేదని వ్యాఖ్యానించారు. ఈ పరిస్థితుల్లో యూరోపియన్ యూనియన్ సొంత సైన్యాన్ని తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. సైనికులకు శిక్షణ విన్యాసాల సాకుతో రష్యా తన మిత్రదేశమైన బెలారస్‌కు తన సైన్యాన్ని పంపాలని యోచిస్తున్నట్లు ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ వర్గాలు తెలిపినట్లు జెలెన్ స్కీ పేర్కొన్నారు. పుతిన్ దానిని మరొక రష్యన్ ప్రావిన్స్‌గా భావిస్తున్నారని అన్నారు. ఈ చర్యలు నాటో దేశాల కూటమికి ప్రత్యక్ష ముప్పును కలిగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేస్తానని డొనాల్డ్ ట్రంప్ పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చిన తర్వాతా ఇరుదేశాల అధ్యక్షులతో మాట్లాడారు. పుతిన్ (Putin) తనతో ఫోన్‌లో మాట్లాడారనీ.. యుద్ధంలో లక్షల మంది ప్రాణ నష్టాన్ని అరికట్టాలన్న అంగీకారానికి వచ్చారనీ తెలిపారు. ఉక్రెయిన్‌తో తక్షణమే చర్చలు మొదలు పెట్టేందుకు పుతిన్ ఒప్పుకొన్నారన్నారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడారు. కీవ్ నాటో (NATO) సభ్యత్వం ప్రాక్టికల్‌గా సాధ్యం కాదని తేల్చి చెప్పారు.

## మహిళలు, చిన్నారులపై నేరాల నియంత్రణకు.. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు

* **వెంటనే ఘటనాస్థలానికి చేరేలా సత్వర స్పందన దళాలు**
* **హేయమైన నేరాలకు పాల్పడేవారిపై ఉక్కుపాదం**
* **అన్నమయ్య జిల్లాలో యాసిడ్ దాడి, ఇతర నేరాల్లో కఠిన శిక్షలు పడేలా చర్యలు**
* **డీజీపీ హరీష్ కుమార్ గుప్తా**

అమరావతి: మహిళలు, చిన్నారులు, వృద్ధులపై జరిగే హేయమైన నేరాల నియంత్రణకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటుచేస్తున్నట్లు డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ప్రకటించారు. నేరగాళ్ల నుంచి ఎలాంటి ముప్పు ఎదురైనా వెంటనే ఘటనా స్థలానికి చేరుకునేలా సత్వర స్పందన దళాలు (ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్) సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అన్నమయ్య జిల్లాలో యువతిపై యాసిడ్ దాడి, గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఇటీవల హేయమైన నేరాలకు పాల్పడ్డవారికి జీవితఖైదు లేదా మరణశిక్ష విధించేలా పోలీసుశాఖ పరంగా అన్ని చర్యలూ తీసుకుంటున్నామన్నారు. తాము చేపడుతున్న చర్యలు, కార్యాచరణపై శనివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రధానాంశాలివి.

* నేరాలకు ఆస్కారమున్న ప్రాంతాల్లో గస్తీ, నిఘా బృందాలు
* మహిళలు, చిన్నారులు, వృద్ధులపై నేరాలు జరిగే ఆస్కారమున్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా నిఘా, గస్తీబృందాలు పెడుతున్నాం.
* ఎలాంటి నేరాల ముప్పు ఉందో ముందే గమనించి.. అవి జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం.
* నేరాలే వృత్తిగా ఉన్నవారి (హేబిట్యుయల్ అఫెండర్స్) కదలికలపై నిరంతర నిఘా కొనసాగిస్తున్నాం.
* సున్నితమైన కేసుల్లో బాధితుల పట్ల వ్యవహరించాల్సిన తీరుపై పోలీసులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం.
* న్యాయస్థానాల్లో నేరనిరూపణ చేయించి.. నేరగాళ్లకు చట్టపరంగా శిక్ష వేయించేలా ఫోరెన్సిక్ ఆధారాలు పక్కాగా సేకరించాలని ఆదేశాలిచ్చాం.

**సైబర్ స్పేస్‌లో నేరాలపై ప్రత్యేక నిఘా**

* సామాజిక మాధ్యమాలు, సైబర్ వేదికలు ఉపయోగించుకుని ఆన్‌లైన్ గ్రూమింగ్, బెదిరింపులకు పాల్పడుతున్నవారిపై ప్రత్యేక నిఘా పెట్టాం.
* సైబర్ వేదికల్లో అనుమానాస్పద కార్యకలాపాలు, డార్క్‌వెబ్ ద్వారా చట్టవిరుద్ధ వ్యవహారాలకు పాల్పడేవారిని నిరంతరం గమనిస్తున్నాం.
* లైంగిక దోపిడీ, హింసాత్మక దాడులు, డిజిటల్ వేధింపులకు పాల్పడేవారి వివరాలు సామాజిక మాధ్యమాల ద్వారా సేకరిస్తున్నాం. చట్టపరంగా చర్యలు తప్పవు.
* అత్యవసర వేళల్లో 100 లేదా 112కు కాల్ చేయండి
* అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం టోల్‌ఫ్రీ నంబర్లు 100 లేదా 112కు కాల్ చేయండి. పోలీసులు నిమిషాల్లో మీ వద్దకొచ్చి కాపాడతారు.
* నేరం జరిగే అవకాశముందని భావిస్తే ఎవరైనా పోలీసులకు ఫిర్యాదు చేయొచ్చు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. బాధితుల్ని రక్షిస్తాం.
* ఇటీవల రాష్ట్రంలో హేయమైన నేరాలకు పాల్పడినవారిని గమనిస్తే 20 75 ఏళ్ల వయసు వారున్నారు. ఎవరినైనా ఉపేక్షించేది లేదు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతకు పోలీసుశాఖ కట్టుబడి ఉంది.

తల్లిదండ్రులూ.. బాధ్యత తీసుకోండి

# కూకట్ పల్లి నియోజకవర్గం టీయూడబ్ల్యూజే (143) నూతన కార్యవర్గం నియామకం



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(143) కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆస్కాన్ని మారుతి సాగర్ లు ప్రకటించారు. నూతన అధ్యక్షులుగా నిమ్మల శ్రీనివాస్ ,ప్రధాన కార్యదర్శిగా కోహీర్ నాగరాజు యాదవ్, కోశాధికారిగా సదా మహేష్ లను నియమిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. నియామక ఉత్తర్వులను రాష్ట్ర అధ్యక్షులు అల్లం నారాయణ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.మారుతి సాగర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్కే దయాసాగర్ లు త్వరలో మిగతా పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. జర్నలిస్టు సంక్షేమ కోసం గత పది సంవత్సరాలుగా టీయూడబ్ల్యూజే 143 ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని వివరించారు. కూకట్ పల్లిలో అర్హులైన జర్నలిస్టులందరికీ సంక్షేమ కార్యక్రమాలు అందేలా, వారి సమస్యల పరిష్కారానికి యూనియన్ తరపున కృషి చేయాలని కోరారు.

# రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ పార్కు ను పరిశీలించిన జిల్లా కలెక్టర్



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : జీనోం వ్యాలీ మెయిన్ రోడ్డు నుండి తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ పార్కు ఏర్పాటుకు ప్రత్యామ్నాయ రోడ్డు కోసం భూసేకరణ నిమిత్తం శనివారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం క్షేత్రస్థాయి భూపరిశీలన నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టరు మ్యాప్ లను పరిశీలించి మురారిపల్లి గ్రామస్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజయ్ వాటర్ ఫ్రంట్ ముందు నుండి రోడ్డుకై స్థలాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పార్కులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా కృషి

* **వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : పార్కులలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు అన్నారు. వివేకానంద నగర్ డివిజన్ లో గల పటేల్ కుంట పార్క్ లో జరిగే అభివృద్ధి పనులలో భాగంగా శనివారం పార్క్ లో నీటి వసతులు సంబంధించి బోర్ వేస్తున్న పనులను సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ సభ్యులతో కలిసి డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మాట్లాడుతూ వీలైనంత త్వరలో పనులను పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో పడిగేశ్వరరావు,చెన్నారావు , రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కూకట్ పల్లి సీఐకి శుభాకాంక్షలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : కూకట్ పల్లి స్టేషన్ హౌస్ అధికారిగా రాజేష్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శనివారం రేయిన్ బో విష్టాస్ రాక్ గార్డెన్ వాసులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేయిన్ బో విష్టాస్ రాక్ గార్డెన్ వాసులు మధుసూదనరెడ్డి, రామ్,ప్రమోద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కృషి, పట్టుదల, క్రమశిక్షణతో పదవ తరగతిలో విజయం సాధించాలి

* **మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం**





మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : కృషి, పట్టుదల, క్రమశిక్షణతో పదవ తరగతిలో విజయం సాధించి భవిష్యత్తులో ఏమి చదవాలి అనే లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆదిశగా ముందుకు వెళ్లాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం అన్నారు. శనివారం కీసర మండలంలోని బోగారంలో గల మేడ్చల్, ఖైరతాబాదు, అంబర్ పేట్ లకు కలిపి నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ జ్యోతిబా పూలే, బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ (బాలుర) స్కూల్, జూనియర్ కాలేజీని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం తనిఖీ చేసారు. పదవ తరగతిలోని ప్రతి విద్యార్థితో ముచ్చటించారు. భవిష్యత్తులో ఏమి చదువుతారని, ఏగ్రూపు తీసుకుంటారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ కృషి, పట్టుదల, క్రమశిక్షణే మీ విజయానికి కారణమని, పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించి, భవిష్యత్తు లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఇదే స్ఫూర్తితో చదువుకోవాలని విద్యార్థులకు బోధించారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. భోజన శాలలో టేబుల్లు, కుర్చీలు విద్యార్థులకు సరిపడా ఏర్పాటు చేయాలని కలెక్టరు ప్రిన్సిపల్ కు సూచించారు. అవసరమైన మరమ్మత్తులు చేయించేందుకు అయ్యే ఖర్చులను యాజమాన్యానికి ఇచ్చే అద్దెలో కొంచెం కొంచెంగా మినహాయించి మరమ్మత్తులు చేయించాలని నిర్వాహకులకు తెలిపారు. స్కూలులోని వంట శాలను, స్టోరు రూంను కలియ తిరిగి పరిశీలించారు. స్టోరు రూంలోని వంట సామాగ్రిని పరిశీలించి తడి లేకుండా సామాగ్రిని నిలువ ఉంచాలని కలెక్టరు స్టోర్ ఇంఛార్జిని ఆదేశించారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈరోజు మెనులో ఏమి వండారని వంటలను పరిశీలించారు. స్కూలు కాలేజీ కలిపి మొత్తం ఎంత మంది విద్యార్థులున్నారని, ఇంటర్ లో ఏఏ గ్రూపులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఫస్ట్ ఫేజ్ జెఈఈలో 89 శాతం సాధించిన కె.తరుణ్ ను కలెక్టరు అభినందించారు. తరుణ్ కు అవసరమైన స్టడీ మెటీరియల్ ను, అవసరమైన చేయూతనందించాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వెంకట ఉపేందర్ రెడ్డి, కీసర తహాసీల్దారు అశోక్, ఇంఛార్జి ప్రిన్సిపల్ కేశవ, తదితరులు పాల్గొన్నారు.

# మానవ శ్రేయస్సు కోసం మనందరం కృషి చేయాలి

* **శేరిలింగం పల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ చూపిన ఆదర్శమార్గంలో మానవ శ్రేయస్సు కోసం మనందరం కృషి చేయాలని శేరిలింగం పల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. బంజారాల ఆరాధ్యదైవం శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ 286 వ జయంతి సందర్భంగా అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్ నగర్ లో జరిగిన జయంతి వేడుకలలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, బంజారా, లంబాడాల ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ భారత సాంస్కృతి సంప్రదాయాలను కాపాడిన మహనీయులు సేవాలాల్ మహరాజ్ ,దేశం పట్ల ధర్మం పట్ల ఆయన ఎన్నో సేవలుచేసారన్నారు. దేశంకోసం ,హిందు ధర్మంకోసం, ఆయన సేవలు కొనియాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం ఎంతగానో కృషి చేశారని అన్నారు.సేవాలాల్ మహరాజ్ మానవ మాతృడు కాదు అని దైవంతా సంబుతులని అన్నారు. గిరిజనుల అభ్యున్నతికి నిరంతరం శ్రమించిన నిత్య కృషి వలుడు అని, గిరిజనులు మంచి చదువులు చదువుకొని అన్ని రంగాలలో అభివృద్ధి చెందలని ఆశించిన మహానుభావుడు అని అన్నారు. బంజారాలకు స్ఫూర్తి ప్రదాతగా నాటి కాలంలో వారు చేసిన కృషి, విశ్వవ్యాప్తంగా వున్న బంజారాలకు వారిని ఆధ్యాత్మిక గురువుగా, తమ ఆరాధ్య దైవంలా కొలిచేలా చేసిందని తెలియచేసారు.ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో సృజనాత్మకత నైపుణ్యాన్ని పెంపొందించడానికి

* **ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్**
* **సెయింట్ మేరీస్ పాఠశాలలో ఆకట్టుకున్న నమూనాలు**





ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఒకరేమో హీరోస్ ఆఫ్ ఫ్రీడమ్ ఫైటర్స్.. మరొకరేమో అన్నదాత ఆర్ట్.. సుప్రీంకోర్టు.. రోబో వర్షన్ 2.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో నమూనాలు .. కళలు ఏ ఒక్కరి సొంతం కాదు... ప్రతీ ఒక్కరికీ ఏదో ఒక కళ దాగి ఉంటుంది. దాన్ని వెలికితీసే ప్రయత్నం చేస్తే భవిష్యత్తులో అద్భుతాలు ఆవిష్కృతం అవుతయనడంలో సందేహం లేదు. అటువంటి ప్రయత్నమే చేశారు శనివారం కొత్తగూడెం సెయింట్ మేరిస్ గర్ల్స్ హై స్కూల్ యాజమాన్యం. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా తయారు చేసిన నమూనాలు ఏది చూసినా వావ్ అనాల్సిందే.. తమ పిల్లలు తయారుచేసిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ చూసి తల్లిదండ్రులు తెగ మురిసిపోయారు.. చేతిలో ఉన్న సెల్ ఫోన్ కు పని చెప్పారు.. ఇదిగో మా పాప తయారుచేసిన సెయింట్ మేరీస్ పాఠశాల.. మరో తల్లి మా పాప తయారు చేసిన అయోధ్య రామ మందిరం.. అంటూ పిల్లల్లో దాగిన ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ విద్యార్థులకు ఎంతోగానో ఉపయోగ పడతాయని విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు అంటున్నారు.ఒకరు అయోధ్య రామమందిరం తయారు చేయగా... మరోకరు చంద్రయాన్ తయారు చేసి ఎగ్జిబిషన్ పెట్టి ఔరా అనిపించాడు. మారుతున్న కాలానికి అనుగుణంగా "పాత" కొత్త తరహాలో విద్యార్థులు అర్థాన్ని ఇచ్చే ఎన్నో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ తయారీలో సెయింట్ మేరీస్ విద్యార్థులు ప్రతి ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఒక మంచి అర్థాన్నిచ్చాయి. కొత్తగూడెం సెయింట్ మేరీస్ పాఠశాలకు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయులు సూచనల మేరకు ఎన్నో అద్భుతమైన వస్తువులను తయారుచేశారు. సెయింట్ మేరీస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు తయారు చేసిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.. ఈ యొక్క ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ఇవ్వనున్నట్లుగా పాఠశాల యాజమాన్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో సెయింట్ మేరీస్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సిస్టర్ మేరీ జాన్, రూబి, థెరిసా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చు

* **జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలు అరికట్టే అవకాశం ఉందని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు.జిల్లా పరిధిలోని పరిశ్రమలు,వ్యాపార సముదాయాలు,కాలనీలు, ఇండ్ల పరిసరాలలో సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ శనివారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని,సీసీ కెమెరాల వల్ల భద్రతా ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు.దొంగతనాల నివారణకు,రోడ్డు ప్రమాదాల్లో వాహనాలను గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. జిల్లాలోని ప్రధాన రహదారులు,ముఖ్యమైన ప్రదేశాలలో కెమెరాలను ఏర్పాటు చేస్తే నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. నేరాలను ఛేదించడంతోపాటు నియంత్రించడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకంగా మారిందని అన్నారు. కావున జిల్లా ప్రజలందరూ పోలీస్ యంత్రాంగానికి సహకరిస్తూ తాము నివసించే ప్రదేశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# నగరాలకు ధీటుగా పట్టణాల అభివృద్ధి..

* **మాస్టర్ ప్లాన్ సర్వే షురూ.**



భద్రాద్రి కొత్తగూడెం, (ప్రజాస్ఫూర్తి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు మాస్టర్ ప్లాన్ సర్వే చేపడుతున్నట్టు కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ తిరునహరి శేషంజన స్వామి తెలిపారు. పట్టణాభివృద్ధికి, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా, రాబోయే 30 సంవత్సరాలకు మౌలిక సదుపాయాలు కల్పనే ధ్యేయంగా ఈ మాస్టర్ ప్లాన్ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. శనివారం పాత కొత్తగూడెంలో ఈ మాస్టర్ ప్లాన్ డ్రోన్ సర్వేను ప్రారంభించారు.

# మానవ హక్కుల ఫోరమ్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గా శ్రీనివాస్ రావు

హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల సంఘం వైస్ ప్రెసిడెంట్ గా కె. శ్రీనివాస్ రావు నియమితులయ్యారు. హుమన్ హ్యూమన్ రైట్స్ ఫోరం కు జాతీయ పరిపాలనా అధ్యక్షులు గంటా స్వామి శనివారం ఉదయం కందుల శ్రీనివాస రావును తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు గా నియమించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ముఖ్యంగా చిన్నారుల హక్కులు, మహిళలు హక్కులు భద్రతా కోసం రాష్ట్రంలో దృష్టి పెట్టి మనవ హక్కుల సంఘం ద్వారా సేవలందిస్తానని తెలిపారు. సమాజంలో ఎక్కడ మానవ హక్కులకు భంగం వాటిల్లినా, సమస్యలు సృష్టించిన వారి పై న్యాయ సంస్థలు ద్వారా చర్యలు తీసుకుంటామని అన్నారు.



## వైద్య శిబిరానికి మంచి స్పందన



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : హైదరాబాద్ నాగోలు సుప్రజ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం రాజపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. సుప్రజా హాస్పిటల్ మేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సిగ విజయ్ కుమార్ గౌడ్ కార్పొరేట్ స్థాయి మెరుగైన వైద్యం అతి తక్కువలో మనందరికీ సుప్రజా హాస్పిటల్ లో అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఫ్రీ హెల్త్ క్యాంప్ ని విజయవంతం చేసిన రాజపేట మండల ప్రజలకి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగవేణి, ఎస్సై అనిల్ కుమార్, ప్రాథమిక ఉన్నత పాఠశాల హెచ్ఎం సట్టు జయంత, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్ గౌడ్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు రాపోలు రామచంద్ర రెడ్డి, సుప్రజ హాస్పిటల్ డాక్టర్స్, ఏజీఎంఎస్ కుమార్ నగేష్ నాగరాజు మార్కెటింగ్ బృందం పాల్గొన్నారు. రాజపేట తోటపాటు పరిసర గ్రామాల ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకొని ఉచితంగా అందజేసిన మందులు తీసుకున్నారు. డాక్టర్ల సలహాలు స్వీకరించారు. కార్డియాలజీ నిపుణులు ఎముకల మహిళల పిల్లల వైద్య నిపుణులు, జనరల్ మెడిసన్, ఆహార పళ్ళ ఫిజియోథెరఫీ నిపుణులు వైద్య సేవలో అందించారు. పలు రకాల ఉచిత వైద్య పరీక్షలు చేశారు. ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించిన సుప్రజ హాస్పిటల్ యాజమాన్యానికి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. సుమారు 400 మందికి పైగా ఈ వైద్య సేవలు అందుకున్నారు.

## ఇల్లందు క్రాస్ రోడ్ లో అంధకారం..


* ప్రమాదాలకు నిలయం
* చౌరస్తా కాస్త.. చావు రస్తగా మారింది..



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: నిత్యం జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రయాణం చేసే మార్గం.. చీకటి పడిందంటే చాలు అంతా అంధకారం.. వాహనాదారుల్లో భయం భయం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని జాతీయ రహదారి ఇల్లందు క్రాస్ రోడ్డు వద్ద సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో అంధకారం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుని ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. చౌరస్తా కావడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జాతీయ రహదారి అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ ప్రాంతంలో రాత్రి సమయంలో ఇల్లందు, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు వెళ్లే ప్రయాణికులు అంధకారంలో బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.. భారీ వాహనాలు ప్రయాణించడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ ప్రాంతంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాల్సిందిగా ప్రయాణికులు, వాహనదారులు. కోరుతున్నారు.

## పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

**ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : పేద ప్రజల అపోహలు తొలగించి వెంటనే పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం.డీ షాబీర్ అలీ కి వినతి పత్రంతో పాటు అర్హులైన మున్సిపల్ కార్మికుల లిస్టు ఇవ్వడం జరిగింది. అనంతరం ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో వున్న పేదలకు అన్యాయం చేస్తే ముందుగా ఉండేది ఎర్ర జెండానే అని గుర్తు చేశారు. అర్హులైన పేద, బలహీనవర్గాలైన మున్సిపల్ కార్మికులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీలు అమలు చేయాలన్నారు. గతంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్లో ప్రకటించిన ఇందిరమ్మ ఇల్లుల లిస్టులో అనేక అవకతవకలు వున్నాయి అని పేద ప్రజలకు కాకుండా పెద్ద భవనాలు వున్నా వారికే లిస్టులో పేరు వచ్చింది అని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. నిజాంపేట్ మున్సిపల్లో ఒక గ్రూప్ లీడరును మార్చడం వల్ల అ గ్రూపులో పనిచేసే కార్మికులకు గత రెండు నెలలుగా జీతాలు రావడం లేదు అని వారికీ వెంటనే జీతాలు వచ్చే విధంగా కమిషనర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కు గండికోటే అనుమతిలేని అక్రమ భవనాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని గతంలో పాలకవర్గానికి బయపడి కొంత వెనకడుగు వేసిన ఇప్పుడు వున్నా అధికారులకు పూర్తి అధికారం ఉంటుందన్నారు. వెంటనే అటి అక్రమ నిర్మాణాల పై చర్యలు తీసుకోవాలని, ఒక మంచి పనికి భారత కమ్యూనిస్ట్ పార్టీ బాచుపల్లి మండల పక్షాన పూర్తి మద్దతు ఇస్తాము అని లేని పక్షంలో పెద్ద ఎత్తున అర్హులైన పేద, బలహీన వర్గాలను సమీకరించి పోరాటం నిర్వహిస్తాము అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# సందీప్ మక్తాలా, బాబా రామ్‌దేవ్ సమన్వయంతో సమగ్ర ఆరోగ్య విప్లవం

* **టీకన్సల్ట్ గ్లోబల్ ప్రభావాన్ని ప్రశంసించిన బాబా రామ్‌దేవ్**

సమగ్ర ఆరోగ్య సంస్కృతిని విస్తరించేందుకు నిపుణులను ఆహ్వానిస్తున్న టీకన్సల్ట్

హరిద్వార్, ప్రజాస్ఫూర్తి : సమగ్ర ఆరోగ్య సంస్కృతికి గ్లోబల్ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంటున్న టీకన్సల్ట్ ఇంటిగ్రేటెడ్ హెల్త్ నెట్ వర్క్ (టిఐహెచ్ఎన్) ప్రస్థానానికి మరో గౌరవం దక్కింది. ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్ ఈ ఉద్యమానికి మద్దతుగా నిలిచారు. నేచురోపతి నిపుణుడు డా. మంతెన సత్యనారాయణ రాజు, ఫార్మా దిగ్గజం డివిస్ ల్యాబొరేటరీస్ సహవ్యవస్థాపకుడు డివి మాధుసూదన్ రావు తదితర ప్రముఖులు ప్రశంసించిన అనంతరం, బాబా రామ్‌దేవ్ టీకన్సల్ట్ విజన్‌ను అభినందిస్తూ, ఆయుర్వేదం, నేచురోపతి, హోమియోపతి, అల్లోపతి , హోలిస్టిక్ వెల్‌నెస్‌ను ప్రపంచవ్యాప్తంగా సమగ్రంగా అనుసంధానించడం భారతదేశాన్ని గ్లోబల్ హెల్త్ లీడర్‌గా తీర్చిదిద్దే విప్లవాత్మక అడుగు అని ప్రశంసించారు. హరిద్వార్‌లో టీకన్సల్ట్ ఛైర్మన్ సందీప్ కుమార్ మక్తాలాతో సమావేశమైన బాబా




రామ్‌దేవ్, ప్రాచీన వైద్య పద్ధతులను ఆధునిక వైద్యానికి అనుసంధానించే టీకన్సల్ట్ ప్రయత్నాన్ని ప్రశంసించారు. సమగ్ర వైద్య విధానాన్ని ప్రపంచానికి అందుబాటులోకి తేవడంలో భారతదేశం ముందుండాలని, అలాగే ప్రివెంటివ్, క్యురేటివ్, హోలిస్టిక్ ఆరోగ్య సంస్కృతిని కలిపే యూనిఫైడ్ హెల్త్‌కేర్ మోడల్ అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. బాబా రామ్‌దేవ్ మాట్లాడుతూ "భారతదేశం ఎప్పటి నుంచో సమగ్ర ఆరోగ్య సంస్కృతికి మార్గదర్శి. అయితే టీకన్సల్ట్ ఈ సంప్రదాయాన్ని ప్రపంచానికి చేర్చేందుకు ముందుకు సాగుతోందన్నారు. ఆధునిక వైద్యం, ఆయుర్వేదం, యోగ, నేచురోపతి కలయికతో గ్లోబల్ హెల్త్ కేర్ రంగాన్ని పునర్నిర్వచించనుంది. సంప్రదాయం , సాంకేతికత కలయికే భవిష్యత్, ఈ మహత్తర ప్రయత్నానికి నా సంపూర్ణ మద్దతు." అని తెలియజేశారు.ఈ సందర్భంగా టీకన్సల్ట్ ఛైర్మన్ సందీప్ మక్తాలా మాట్లాడుతూ, మా లక్ష్యం ఆధునిక వైద్యం , సంప్రదాయ వైద్య పద్ధతుల మధ్య అనుసంధానం సాధించి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలకు సమగ్ర ఆరోగ్య సంస్కృతిని అందుబాటులోకి తేవడం. ఈ దిశగా మన వైద్య నిపుణులు, సంప్రదాయ వైద్యులు కలిసికట్టుగా పని చేయాలి. వ్యక్తిగతంగా దేశ వ్యాప్తంగా ప్రయాణిస్తూ ఆయుర్వేద, నేచురోపతి, హోమియోపతి నిపుణులతో కలిసి మా నెట్‌వర్క్‌ను విస్తరిస్తాను." అని అన్నారు."ఇది కేవలం ఒక ప్రారంభం మాత్రమే. సమగ్ర ఆరోగ్య సంస్కృతి ప్రాధాన్యతను ప్రపంచం దృష్టికి తీసుకెళ్లేందుకు టిఐహెచ్ ఎన్ ఎంతో కీలకంగా మారనుంది. అందుకే అన్ని రంగాల ఆరోగ్య నిపుణులను, వెల్‌నెస్ ప్రాక్టీషనర్లను ఈ విప్లవాత్మక ప్రయాణంలో భాగస్వామ్యం కావాలని కోరుకుంటున్నాను." అని మక్తాలా పేర్కొన్నారు. టీకన్సల్ట్ గ్లోబల్ ప్రాప్యతకు నిదర్శనంగా, ఇటీవల డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు గారి ఆరోగ్య ఉపన్యాసం 13 భాషల్లో 60 దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం చేయబడింది. టీకన్సల్ట్ అభివృద్ధి చేసిన ఏఐ ఆధారిత తక్షణ అనువాద సాంకేతికత ద్వారా ఇది సాధ్యమైంది. ఈ టెక్నాలజీకి బాబా రామ్‌దేవ్ హర్షం వ్యక్తం చేస్తూ, డిజిటల్ సాంకేతికతలు సంప్రదాయ వైద్యాన్ని ప్రపంచానికి అందుబాటులోకి తేవడంలో ఎంత ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నాయో వివరించారు.ప్రస్తుతం 63 దేశాల్లో తన ప్రభావాన్ని చూపుతున్న టిఐహెచ్ఎన్, ప్రపంచవ్యాప్తంగా హాస్పిటల్స్, ఆరోగ్య నిపుణులు, సంప్రదాయ వైద్య విధానాలను పాటించే వ్యక్తులను తన నెట్‌వర్క్‌లోకి ఆహ్వానిస్తోంది. భారతీయ ఆరోగ్య సంపదను ప్రపంచానికి అందించడం ద్వారా, కేవలం ఆరోగ్య రంగానికే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థను కూడా మెరుగుపరిచే దిశగా టిఐహెచ్ ఎన్ పని చేస్తోందన్నారు..

## సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి

: **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శనివారం బంజారా వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఇల్లందు క్రాస్ రోడ్ లో గల కార్తీక వనంలో ఏర్పాటు చేసిన సంత్ సేవాలాల్ మహారాజ్ 286 వ జయంతి ఉత్సవాలకు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా కలెక్టర్ ను బంజారా సాంప్రదాయం ప్రకారం బంజారా ఉద్యోగులు సంప్రదాయం పద్ధతిలో తలపాగా చుట్టి ఎద్దుల బండి పై వేదిక వద్దకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ సంపత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జ్యోతి ప్రజ్వలన చేసి, భోగ్ బండారొ , వింతి కార్యక్రమాలను నిర్వహించారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ .. సంత్ సేవాలాల్ తన బోధనల ద్వారా బంజారా జాతి అభివృద్ధికి



ఎంతో కృషి చేశారన్నారు. తండాల నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. హింస, మత్తు, ధూమపానాలకు దూరంగా ఉండాలని హితువు పలికి యావత్ ప్రజానీకానికి ఆదర్శంగా నిలిచారని, బంజారా జాతిని చీకటి నుంచి వెలుగులోకి తీసుకొచ్చిన ఒక విప్లవ చైతన్య మూర్తి అని, దేశం గర్వించదగ్గ గొప్ప ఆధ్యాత్మికవేత్త, సమాజ శ్రేయస్సు కోసం సంత్ సేవాలాల్ మహారాజ్ చూపించిన మార్గం అందరికీ ఆదర్శనీయమన్నారు. సేవాలాల్ మహారాజ్ తన బోధనల వల్ల బంజారా జాతి పురోగమించడానికి తో కృషి చేశారని పేర్కొన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో మనమందరం పయనించి ఆయన ఆశయాలను కొనసాగించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో లో జిల్లా,వైద్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, డిసిహెచ్ఎస్ రవిబాబు, జి జి హెచ్ ఆర్ ఎం ఓ రమేష్, బంజారా వైద్యులు , వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు .

## బిజెపి జిల్లా అధ్యక్షులుగా ఊట్కూరు అశోక్ గౌడ్

రాజాపేట, ప్రజా స్ఫూర్తి : మొట్టమొదటిసారిగా రాజపేట మండలానికి జిల్లా పార్టీ పగ్గాల బాధ్యతలు బిజెపి నుండి దక్కాయి. బిజెపి సంఘటన పర్వ 2024 ఎన్నికల నియమాల ఆధారంగా ఎన్నికల అధికారి ఎండల లక్ష్మీనారాయణ బిజెపి జిల్లా అధ్యక్షులుగా రాజపేట మండల కేంద్రానికి చెందిన ఊట్కూరు అశోక్ గౌడ్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఏ పార్టీ నుండి జిల్లా పార్టీ బాధ్యతలు రాజపేట మండలానికి దక్కలేదు. దీంతో బిజెపి పార్టీ క్రెడిట్ ను దక్కించుకుంది. పార్టీని నమ్ముకొని సైనికుడిలా పనిచేసే వారికి బిజెపి గుర్తింపు ఇస్తుందని సామాన్యుడైన ఊట్కూరు అశోక్ గౌడ్ నియామకంతో మరోసారి రుజువు చేసినట్లయి0ది. నిరంతర శ్రమ, సేవ, అంకితభావం లాంటి అర్హతలతో అశోక్ కు అధ్యక్ష పదవి దక్కింది. 1994లో ఏబీవీపీ కార్యకర్తగా జైశ్రీరామ్



ఫౌండేషన్ ఏర్పాటు ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా, సేవా కార్యక్రమాలలో ముందుండడం, కరోనా సమయంలో ఎనలేని సేవలందించడం, బిజెపి నాయకుడిగా వార్డు సభ్యులుగా, ప్రజా ప్రతినిధిగా, జిల్లా ఉపాధ్యక్షులుగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఒక్కొక్క మెట్టు పార్టీ పదవులలో అధిరోహిస్తూ అందరికీ తలలో నాలుకలా ఉండే ఉట్కూరు అశోక్ గౌడ్ కు జిల్లా పార్టీ పగ్గాలు వరించాయి. ఈ సందర్భంగా రాజపేటలో సంబరాలు అంబరాన్ని అంటాయి. కార్యకర్తలు నాయకులు అభిమానులు బాణాసంచా కాల్చారు మిఠాయి పంపిణీ చేశారు. ప్రత్యేక వాహనంలో ఊట్కూరు అశోక్ గౌడ్ ను ఊరేగించారు. పలువురు అశోక్ గౌడును పూలమాలలు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించి కృషిచేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు చెప్పారు. పార్టీ పదవికి మరింత వన్నె తెచ్చే విధంగా కార్యకర్తలకు ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. పార్టీ కోసం కార్యకర్తల కోసం నిరంతరం అందుబాటులో ఉండే ఊట్కూరు అశోక్ గౌడు మార్గదర్శకుడని బిజెపి శ్రేణులు సంతోషం వ్యక్తం చేశారు. ఉట్కూర్ అశోక్ గౌడ్ నియామకంతో రాజపేట మండల బిజెపి శ్రేణుల్లో అభిమానుల్లో ఎనలేని ఆనందం చోటుచేసుకుంది. అన్ని పార్టీల నాయకులు సైతం అశోక్ గౌడ్ ను అభినందించారు.

## సర్వే వివరములు నమోదు చేసుకో లేని కుటుంబాలకు ప్రభుత్వం మరో అవకాశం

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఇంటింటి కుల గణన" కార్యక్రమము నందు సర్వే వివరములు నమోదు చేసుకో లేకపోయిన కుటుంబాలకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని నిజాంపేట్ నగరపాలక సంస్థ కమిషనర్ తెలిపారు.ఈ సందర్భంగా గతంలో చేపట్టిన "ఇంటింటి కుల గణన" కార్యక్రమము నందు వివిధ కారణముల వలన సర్వే వివరములు నమోదు చేసుకో లేకపోయిన కుటుంబాలకు మరో అవకాశం కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ నెల 16 నుంచి 28 వరకు మూడు పద్ధతుల ద్వారా నమోదు చేసుకొవాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 040 21111111 ద్వారా కులగనన చేపట్టాలన్నారు. ఆన్లైన్ మాధ్యమం ద్వారా https://seeepcsurvey.cgg.gov.in తమ వివరాలు స్వయంగా నమోదు చేసుకుని అట్టిప్రతిని మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల లోపు సమర్పించాలన్నారు. స్వయంగా మున్సిపల్ కార్యాలయమునకు ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల లోపు విచ్చేసి అక్కడ లభించే దరఖాస్తుల యందు తమ వివరములను నమోదు చేసుకుని తిరిగి అక్కడే సమర్పించాలన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్ తెలిపారు. శనివారం మండలంలోని చిప్పల్లపల్లి గ్రామ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా మానేరు నుంచి దొంగతనంగా ఇసుకను ట్రాక్టర్‌లో అక్రమంగా రవాణా చేస్తుండగా నారాయణపూర్‌కు చెందిన శీతల నరేష్, బొప్పాపూర్‌కు చెందిన బత్తుల సింహాద్రిలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌కు సీజ్ చేసి, పట్టుబడ్డ ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

## ఇరుకైన రోడ్లో ఇరుక్కున్న లారీ, స్కూల్ వ్యాన్..

* **తప్పిన ప్రమాదం**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: బైపాస్ రోడ్డు పనులు గత కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోవడంతో ఆ మార్గాన వెళ్లి వాహనా దారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. కొత్తగూడెం విజయవాడ జాతీయ రహదారి రామవరం గోధుమ వాగు యూటర్న్ వద్ద రోడ్డుగా ఇరుకుగా ఉండడంతో శనివారం ఉదయం సమయంలో ఓ లారీ, స్కూల్ వ్యాను ఇరుక్కున్నాయి. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్కూల్ వ్యాన్ లో ఉన్న విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రాంతంలో తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ కి సంబంధించిన బార్కెట్లను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.

## కుల సర్వే లో గతంలో పాల్గొనని కుటుంబాలు స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకోవాలి

బోడుప్పల్, (ప్రజాస్ఫూర్తి) : సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ , కుల సర్వే లో గతంలో పాల్గొనని కుటుంబాలు స్వచ్ఛందంగా మున్సిపల్ ప్రజా పాలన సేవా కేంద్రంలో ఫిబ్రవరి 16 నుండి 28 వరకు దరఖాస్తు సమర్పించవచ్చునని బోడుప్పల్ నగర పాలక సంస్థ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం లో ప్రజా పాలన సేవా కేంద్రం యందు ప్రజాపాలన దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. దరఖాస్తులు సమర్పించడానికి మున్సిపల్ ఆఫీసు నుండి ఇల్లు దూరంగా ఉన్నవారు టోల్ ఫ్రీ నెంబర్ 14420 కి లేదా మున్సిపల్ పౌర సేవా కేంద్రం ఫోన్ నెంబర్ 04027215959 ఫోన్ చేసి మీ అడ్రస్ ను తెలిపినచో మున్సిపల్ వార్డ్ ఆఫీసర్ మీ ఇంటికి వచ్చి దరఖాస్తులు నింపి డాటా ఎంట్రీ చేస్తారని తెలిపారు. గత సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ , కుల సర్వేలో దరఖాస్తు చేయని వారు మాత్రమే ఇట్టి అవకాశంను సద్వినియోగం చేసుకొని దరఖాస్తు చేసుకోవాలన్నారు.ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఫిబ్రవరి 16 నుండి 28 వరకు మున్సిపల్ కార్యాలయ యందు ప్రజాపాలన సేవ కేంద్రంలో మున్సిపల్ సిబ్బంది దరఖాస్తు ఫామ్ తో సిద్ధంగా ఉంటారన్నారు. సర్వే ఫారం ను http://seeepcsurey.cgg.gov.in నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చునని తెలిపారు.

# ప్రయాగ్ రాజ్ వెళ్లే భక్తులకు శుభవార్త

- మహా కుంభమేళాకు ప్రత్యేక వందే భారత్ రైళ్లు
- వివరాలు వెల్లడించిన రైల్వే మంత్రిత్వ శాఖ



**నేషనల్ బ్యూరో:** ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్ రాజ్ వద్ద అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహా కుంభమేళాకు రైలు ప్రయాణం ద్వారా వెళ్లాలని చూస్తున్న వారికి గుడ్ న్యూస్. ఎందుకంటే భక్తుల ప్రయాణం మరింత సులభతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయాగ్‌రాజ్‌కి ప్రత్యేక వందే భారత్ రైలును ప్రకటించింది. ఈ రైలు నేటి (ఫిబ్రవరి 15) నుంచి ఫిబ్రవరి 17 వరకు కొనసాగుతుంది. మహాకుంభ మేళాకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో రైల్వే మంత్రిత్వ శాఖ ఈ ప్రత్యేక రైలు సేవలను ప్రకటించింది. ఈ రైలు హై స్పీడ్ సర్వీసుతో భక్తులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందిస్తుంది. ఈ ప్రత్యేక వందే భారత్ రైలు (రైలు నెం. 02252) న్యూఢిల్లీ నుంచి వారణాసి మధ్య నడుస్తుంది. ఈ ట్రైన్ న్యూఢిల్లీ నుంచి ఉదయం 05:30 గంటలకు బయలుదేరి, మధ్యాహ్నం 14:20 గంటలకు వారణాసి చేరుకుంటుంది. ప్రయాగ్‌రాజ్ చేరుకునే సమయంలో భక్తులు తక్కువ సమయంలో సౌకర్యవంతమైన ప్రయాణం ఆస్వాదిస్తారు. ఈ రైలు ప్రత్యేకత ఏమిటంటే ఇందులో సౌకర్యవంతమైన సీట్లు, హైస్పీడ్ ప్రయాణం, వైఫై, ఆన్ బోర్డ్ ఇన్ఫోటైన్‌మెంట్, స్పెషల్ క్లీనింగ్ వంటి అనేక సౌకర్యాలు ఉన్నాయి. ఈ వందే భారత్ రైలు భక్తులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

**పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి**

నగరంలో పరిస్థితి కంట్రోల్ చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహా కుంభ నగరంలో పెద్ద సంఖ్యలో వస్తున్న భక్తులకు రద్దీ ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శనివారం ఫాల్గుణ మాసం కృష్ణ పక్ష తృతీయ నేపథ్యంలో భక్తులు, సాధువులు, ఋషులు, గృహస్థులు, ఆధ్యాత్మిక పర్యాటకులు కూడా సంగమంలో ప్రత్యేకంగా స్నానం చేసేందుకు తరలివస్తుంటారు. అయితే ఈ రోజు సంగమంలో స్నానం చేస్తే ఒక నెల పాటు కల్పాలు చేసిన పుణ్యాన్ని పొందుతారని భక్తుల నమ్మకం.

## ఇప్పటికే 50 కోట్ల భక్తుల పవిత్ర స్నానాలు

నేడు మహాకుంభ మేళా 34వ రోజు కొనసాగుతోంది. ఈ క్రమంలో ఇప్పటివరకు గత 33 రోజుల సమయంలో కుంభమేళాకు 50 కోట్లకు పైగా భక్తులు వచ్చి, పవిత్ర సంగమంలో స్నానాలు చేశారని అధికారులు తెలిపారు. వారాంతం వచ్చిన నేపథ్యంలో సంగమం ఒడ్డున జనసమూహం మరింత అధికం కానుంది. ఈ నేపథ్యంలో యాత్రికులు, సాధువులు, ఋషులు, భక్తులు పవిత్ర సంగమం వద్ద పూజలు, స్నానాలు చేయడానికి ఇంకా తరలివెళ్తున్నారు. రద్దీ నేపథ్యంలో ప్రయాగ్‌రాజ్ సంగమం రైల్వే స్టేషన్ ఫిబ్రవరి 16 వరకు మూసివేయబడుతుందని ప్రకటించారు.

## వైసీపీ నేత వల్లభనేని వంశీ
# ఇంట్లో మరోసారి సోదాలు

- ఆయన మొబైల్ ఫోన్ కోసం తీవ్ర ప్రయత్నాలు



**ఏపీ బ్యూరో:** వైసీపీ నేత వల్లభనేని వంశీ కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. హైదరాబాద్‌లోని వంశీ నివాసంలో మరోసారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసులు సోదాలు నిర్వహించారు. రాయదుర్గం పోలీసుల సహకారంతో వంశీ ఇంట్లో తనిఖీలు చేస్తున్నారు పోలీసులు. వంశీ ఇంట్లో ఓ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఎస్ఐ, కానిస్టేబుల్ సోదాల్లో పాల్గొన్నారు. వంశీ మొబైల్ కోసం పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. వంశీ మొబైల్‌లో కీలక ఆధారాలు ఉన్నాయని కాప్స్ భావిస్తున్నారు. వల్లభనేని ఇంట్లో సీసీటీవీ ఫుటేజీని ఓ బృందం సేకరించింది. వంశీ కేసు కోసం ఏపీ సీఐడీ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కాగా.. గన్నవరం టీడీపీ కార్యాలయం విధ్వంసం కేసులో ఫిర్యాదుదారుడు సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసిన కేసులో వల్లభనేని వంశీమోహన్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు కీలక ఆధారాలను సేకరించారు. సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేసిన దృశ్యాలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు సేకరించారు. వల్లభనేని వంశీమోహన్‌కు విజయవాడ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో వంశీని పోలీసులు విజయవాడ హనుమాన్ పేటలోని జిల్లా జైలుకు తరలించారు. జిల్లా కారాగారంలో 14 రోజుల పాటు (ఈనెల 27 వరకు) రిమాండ్ ఖైదీగా వంశీ ఉండనున్నారు. మరోవైపు ఈ కేసులో నిందితులుగా ఉన్న 12 మంది కోసం పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు.



## రైతులను దళారులు దోచుకుంటే ఏం చేస్తున్నారు..?

- కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి కాకాణి విమర్శలు

**ఏపీ బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి సర్కార్ పాలనలో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి. అలాగే, 14 ఏళ్ళు సీఎంగా పనిచేసి 54 సంస్థలను ప్రైవేట్ పరం చేసిన చరిత్ర చంద్రబాబుది అంటూ ఎద్దేవా చేశారు. రైతులను దళారులు దోచుకుంటుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందా? అని ప్రశ్నించారు. నెల్లూరులోని జిల్లా పార్టీ ఆఫీసులో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..'అన్నదాతలపై చంద్రబాబు కక్ష పెంచుకున్నారు. వైఎస్ జగన్ తీసుకొచ్చిన రైతు భరోసా కేంద్రాలను నిర్వీర్యం చేశారు. విత్తనాలు, ఎరువులు దొరక్క రైతులు ఇబ్బంది పడుతున్నారు. గత ప్రభుత్వంలో ఎకరాకి లక్ష రూపాయలు అదనంగా వస్తే.. ఇప్పుడు ఎకరానికి 40 వేలు దాకా రైతులు నష్టపోతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు మాటల్లో తప్ప.. చేతల్లో లేదు. టీడీపీ హయాంలోనే రైతులు అనేక ఇబ్బందులు పడుతుంటారు.

## ఎలాన్ మస్క్ పై రచయిత్రి
# యాష్లే సంచలన పోస్ట్

- నా బిడ్డకు తండ్రి అతనే అంటూ కామెంట్



**నేషనల్ బ్యూరో:** ప్రముఖ దిగ్గజ కంపెనీ టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ప్రపంచానికి పరిచయం అక్కర్లేని పేరు. ఏదో ఒక విశేషం, వివాదంతో నిత్యం వార్తల్లో నిలుస్తుంటారు. ముఖ్యంగా ఈ కుబేరుడి వ్యక్తిగత జీవితం గురించి ఏదో ఒక వార్త హెడ్‌లైన్స్‌లో నిలుస్తుంటుంది. అలాంటిదే తాజాగా మరో వార్త ఇప్పుడు వైరల్ అవుతోంది. మస్క్ గురించి 31 ఏళ్ల రచయిత్రి యాష్లే సెయింట్ క్లెయిర్ ఓ ఆసక్తికర విషయాన్ని బయటపెట్టింది. ఐదు నెలల క్రితం మస్క్ బిడ్డకు తాను జన్మనిచ్చినట్లు వెల్లడించింది. ఈ మేరకు సోషల్ మీడియా ద్వారా సంచలన ప్రకటన చేసింది. 'ఐదు నెలల క్రితం నేను ఓ బిడ్డకు జన్మనిచ్చాను. ఆ బిడ్డకు ఎలాన్ మస్క్ తండ్రి. బిడ్డ గోప్యత, భద్రతను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి వరకూ నేను ఈ విషయాన్ని బయటపెట్టలేదు. కానీ కొన్ని మీడియా సంస్థలు మాత్రం ఆ విషయాన్ని బయటపెట్టాలని ప్రయత్నిస్తున్నాయి. అందుకే నేనే వెల్లడించాలనుకున్నా. మా బిడ్డ సురక్షిత వాతావరణంలో జీవించాలని నేను కోరుకుంటున్నాను. మా గోప్యతకు ఎవరూ భంగం కలిగించొద్దని విజ్ఞప్తి చేస్తున్నా' అని తన పోస్టులో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. కాగా, ఎలాన్ మస్క్‌కు ఇప్పటికే 12 మంది పిల్లలు ఉన్న విషయం తెలిసిందే. మొదటి భార్య జస్టిన్ మస్క్‌కు పుట్టిన తొలి బేబీ.. జన్మించిన 10 వారాల్లోనే మృతిచెందింది. 2008లో ఇదే జంట ఐవీఎఫ్ ద్వారా అయిదుగురు పిల్లలకు జన్మనిచ్చారు. గ్రిఫిన్, వివియన్ కవలలు పుట్టారు. ఆ తర్వాత సాక్సన్, డామియన్, కాయి పుట్టారు. అయితే, కొద్ది రోజులకే ఈ జంట విడిపోయింది. ఇక జస్టిన్‌తో విడాకుల అనంతరం బ్రిటీష్ నటి తలూలాను పెళ్లి చేసుకున్నాడు. ఆమెకు కూడా విడాకులు ఇచ్చారు. అయితే వీరికి సంతానం లేదు. 2020 నుంచి 2022 మధ్య కాలంలో మ్యూజిక్ స్టార్ గ్రైమ్స్‌తో మస్క్ ముగ్గురు పిల్లలు కన్నారు. ఇక 2021లో శివోన్ జిల్లిస్ అనే మహిళతో రహస్యంగా రిలేషన్ కొనసాగించారు మస్క్. మస్క్‌కు చెందిన బ్రెయిన్ టెక్నాలజీ స్టార్టప్ న్యూరాలింక్‌లో శివోన్ జిల్లిస్ పనిచేస్తున్నది. ఆమెకు మొదట ట్విన్స్ పుట్టారు. ఆ తర్వాత మూడో చిన్నారికి కూడా జన్మనిచ్చినట్లు మస్క్ ప్రకటించారు.

# మరోసారి తెరపైకి 'శీష్ మహల్'

- మాజీ సీఎం కేజ్రీవాల్ అధికార నివాసంపై విచారణ
- బంగ్లా పునరుద్ధరణలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు



**నేషనల్ బ్యూరో:** దేశ రాజధాని హస్తినలో ముఖ్యమంత్రి అధికారిక నివాసమైన 'శీష్ మహల్' వ్యవహారం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా ఉన్నప్పుడు శీష్ మహల్ పునరుద్ధరణలో భారీగా అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. బంగ్లాపై వస్తున్న ఆరోపణలపై విచారణకు ఆదేశించింది. కేంద్ర ప్రజాపనుల విభాగం నివేదిక సమర్పించిన తర్వాత ఫిబ్రవరి 13న సమగ్ర విచారణకు ఆదేశించింది. 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లో 40 వేల చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ బంగ్లా ఆధునీకరణ కోసం నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వివరణాత్మక నివేదిక తయారు చేయాలని కేంద్రం ఆదేశించింది. ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా పని చేసిన సమయంలో సివిల్ లైన్స్‌లో ఆయన అధికారిక నివాసం ఏర్పరుచుకున్నారు. అయితే, ఆ నివాసాన్ని బీజేపీ 'శీష్ మహల్'గా అభివర్ణిస్తోంది. ఢిల్లీ సీఎం అధికార నివాసాన్ని దాదాపు రూ.80 కోట్ల ప్రజాధనంతో మరమ్మతులు చేపట్టినట్లు ఆరోపిస్తోంది. ఆధునీకరణంలో భాగంగా టాయిలెట్‌లో గోల్డెన్ కమోడ్, స్విమ్మింగ్ పూల్, మినీ బార్ వంటివి ఏర్పాటు చేసుకున్నారని బీజేపీ నేతలు తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేస్తున్నారు. ఈ బంగ్లాను పునరుద్ధరించడంలో పెద్ద స్కామ్ జరిగిందని తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసింది. మరోవైపు ఇటీవలే జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఘోర పరాభవం పాలైన విషయం తెలిసిందే. 70 స్థానాలకు గానూ బీజేపీ ఏకంగా 48 స్థానాల్లో విజయం సాధించింది. ఆమ్ ఆద్మీ పార్టీ కేవలం 22 స్థానాలకే పరిమితమైంది. ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సహా మనీశ్ సిసోడియా, సౌరభ్ భరద్వాజ్ వంటి కీలక నేతలు సైతం ఓటమి పాలవడం ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. కీలక నేతల్లో ఆప్ సీఎం ఆతిశీ ఒక్కరే గెలుపొందడం కాస్త ఊరటనిచ్చింది. ఈ క్రమంలో 27 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత హస్తినలో కాషాయ జెండా ఎగిరింది. ఇక ఈనెల 19 లేదా 20 తేదీల్లో ఢిల్లీకి కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేయబోతున్నట్లు తెలుస్తోంది. నూతన సీఎం ఈ బంగ్లాకు దూరంగా ఉండాలని బీజేపీ నిర్ణయించుకుంది.

# 'శ్రీవారి టికెట్లు అమ్ముకొని బతికేవాడు'

- జనసేన నేత కిరణ్ రాయల్ పై సంచలన ఆరోపణలు




**ఏపీ బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జనసేన నాయకుడు కిరణ్ రాయల్‌పై మరోసారి సంచలన ఆరోపణలు చేశారు బాధితురాలు లక్ష్మీ. తిరుమల శ్రీవారి దర్శనం టికెట్స్ అమ్ముకుని బ్రతికే వ్యక్తి కిరణ్ అని చెప్పారు. అలాగే, శ్రీవారి వస్త్రం అమ్ముకుని వ్యాపారం చేస్తున్నాడని అన్నారు. ఇదే సమయంలో అమ్మాయిలను మోసం చేసి విలాసవంతమైన జీవితం గడిపిన వ్యక్తి కిరణ్ రాయల్ అని ఆరోపించారు. ఆయన కుటుంబానికి కావాల్సింది డబ్బులు మాత్రమేనని వెల్లడించారు. జనసేన నాయకుడు కిరణ్ రాయల్ బాధితురాలు లక్ష్మీ శనివారం తిరుపతితో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా లక్ష్మీ.. 'కిరణ్ రాయల్ ఏం వ్యాపారాలు చేస్తున్నాడు. అంత లగ్జరీ జీవితం ఎలా గడుపుతున్నాడు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తికి.. ఇంత డబ్బు ఎక్కడిది?. తిరుమల శ్రీవారి దర్శనం టికెట్లు అమ్ముకుని బతుకుతున్నాడు. తిరుమలకు వచ్చే భక్తులను మోసం చేసే దుర్మార్గుడు. కిరణ్ రాయల్‌కు చెన్నైలోని నల్లి సిల్క్స్‌తో ఏం సంబంధం ఉంది?. తాను మోసం చేసే ప్రతీ అమ్మాయిని అక్కడికి తీసుకెళ్లి వారితో ఖరీదైన చీరలను కొనుగోలు చేయిస్తాడు. వేలు ఖర్చు చేయించి మరీ చీరలు కొంటాడు. నల్లి సిల్క్స్‌లో ఏం జరుగుతుందో నేను చెప్పను. ఏం జరుగుతుందో అందరికీ తెలుసు.

ఇక, తిరుమలలో శ్రీవారికి ఏడాదికి ఒక్కసారి మాత్రమే ఇచ్చే వస్త్రం అది. ఒక టికెట్ ద్వారా అది ఇస్తారంటా. అక్కడ కొన్ని చీరలను ఇంటికి తీసుకు వచ్చి పసుపు, కుంకుమ చల్లి.. రాత్రి వాళ్ల ఇంట్లోనే ఉంచి.. దేవుడి చీరలని అమ్ముకుంటాడు. శ్రీవారి వస్త్రం టికెట్ అమ్ముకుని వ్యాపారం చేస్తున్నాడు. వస్త్రం, చీరల బాధితులు కూడా ఉన్నారు. వారు కూడా త్వరలోనే బయటకు వస్తారు. ఏడు కొండల స్వామిని కూడా మోసం చేస్తున్న వ్యక్తి కిరణ్. ఇలా మోసం చేసి సంపాదించడమే కిరణ్ రాయల్‌కు తెలుసు. ఎంతో మంది అమ్మాయిలను మోసం చేసి.. అందరినీ బ్లాక్ మెయిల్ చేస్తాడు.. బెదిరిస్తాడు. వారి ఫొటోలను మార్ఫింగ్ చేసి వేధింపులకు గురిచేస్తున్నాడు. ఇవన్నీ అతడి భార్యకు, కుటుంబ సభ్యులకు కూడా తెలుసు. కానీ, వారికి కావాల్సిందే డబ్బు మాత్రమే. అందుకే కిరణ్‌కు వారి సపోర్టు ఉంది' అని ఆవేదన వ్యక్తం చేశారు.

## 'మౌంటేన్ స్టోరీ' చూడాలంటే మానాలికి వెళ్లాల్సిందే..!

- హిమాలయాల్లో నటి కంగనా రనౌత్ రెస్టారెంట్ ప్రారంభం

**నేషనల్ బ్యూరో:** బాలీవుడ్ క్వీన్‌గా పేరొందిన మండి లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు. హిమాలయాల్లో ఓ రెస్టారెంట్‌ను ప్రారంభించారు. ఈ విషయాన్ని కంగన సోషల్ మీడియా వేదికగా స్వయంగా ప్రకటించారు. ప్రేమికుల రోజు సందర్భంగా మనాలిలో 'ది మౌంటెన్ స్టోరీ' పేరుతో కేఫ్ ను ప్రారంభించినట్లు తెలిపారు. ఇది తన చిన్న నాటి కల అని పేర్కొన్నారు. సంప్రదాయ హిమాచల్ ఫుడ్‌ను మోడ్రన్ అభిరుచులకు అనుగుణంగా అందించడమే లక్ష్యంగా దీన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ట్వీట్ చూసిన నెటిజన్లు, అభిమానులు, పలువురు ప్రముఖులు కంగనకు ఆల్ ది బెస్ట్ చెబుతూ కామెంట్స్ చేస్తున్నారు.




## ప్రయాగ్ రాజ్ జిల్లాలో
# నెత్తురోడిన జాతీయ రహదారి


## కుంభమేళాకు వెళ్తున్న 10మంది భక్తులు దుర్మరణం

- 19 మందికి గాయాలు
- స్పందించిన యూపీ సీఎం యోగి ఆదిత్య నాథ్

**నేషనల్ బ్యూరో:** యూపీ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో పది మంది భక్తులు అక్కడికక్కడే మరణించారు. మరో 19 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించిన సమాచారం తెలుసుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన భక్తులను సమీప ఆస్పత్రులకు తరలించారు. ఈ క్రమంలో మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అందజేయడానికి చర్యలు తీసుకున్నారు. ఈ విషాదకరమైన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. తాజాగా తెలిసిన వివరాల ప్రకారం.. ప్రయాగ్‌రాజ్ నుంచి మీర్జాపూర్ వెళ్ళే హైవేపై ఈ ప్రమాదం జరిగింది.

**ప్రమాదం ఎలా జరిగింది..**

ఈ ప్రమాదం జరిగిన సమయంలో భక్తులతో నిండిన బొలెరో వాహనం, వేగంగా వస్తున్న బస్సును ఢీకొట్టింది. దీంతో బొలెరోలో ప్రయాణిస్తున్న 10 మంది భక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారు ఛత్తీస్‌గఢ్ కోర్బా జిల్లాకు చెందినవారు. ఈ భక్తులు సంగమ స్నానం కోసం మహా కుంభమేళా వెళ్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ప్రయాణిస్తున్న 19 మంది భక్తులు కూడా గాయపడ్డారు. ఈ భక్తులు మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లాకు చెందినవారు, వారణాసి వెళ్ళడానికి సిద్ధమయ్యారు. గాయపడిన వారిని రామ్‌నగర్‌లోని సీహెచ్‌సీలో చేర్చారు. అక్కడ వారికి తక్షణ వైద్య సహాయం అందిస్తున్నారు. ప్రత్యక్ష సాక్షుల ప్రకారం.. బస్సు పక్కకు వెళ్తుండగా, బొలెరో వాహనం అతి వేగంగా వచ్చి బస్సును ఢీకొట్టిందని చెబుతున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో చాలా మంది నిద్రపోతున్నారని, అకస్మాత్తుగా జరిగిన ప్రమాదం మాకు భయంకరమైన అనుభవాన్ని ఇచ్చిందని బస్సులో ప్రయాణిస్తున్న రాడ్మల్ అనే భక్తుడు తెలిపారు. మృతులలో ఈశ్వరీ ప్రసాద్ జైస్వాల్, సంతోష్ సోని, భాగీరథి జైస్వాల్, సోమనాథ్, అజయ్ బంజరే, సౌరభ్ కుమార్ సోని, గంగాదాస్ వర్మ, శివ రాజ్‌పుత్, దీపక్ వర్మ, రాజు సాహు ఉన్నారు. వీరంతా ఛత్తీస్‌గఢ్ కోర్బా జిల్లాకు చెందిన వారిగా గుర్తించబడ్డారు. ఈ ఘటన గురించి పోలీసులు మృతుల కుటుంబాలకు సమాచారం అందించారు.




**ఉత్తర్ ప్రదేశ్ సీఎం స్పందన..**


ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ప్రాణాలు కోల్పోయిన వారి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ఈ క్రమంలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## ఇండియాకు రానున్న మరో వలసదారుల విమానం


- అమృత్‌సర్‌లోనే విమానం ల్యాండ్ అవడంపై వివాదం




**నేషనల్ బ్యూరో:** అగ్ర దేశం అమెరికా నుంచి మరో అక్రమ వలసదారుల విమానం ఇండియాకు రానుంది. అయితే అగ్ర రాజ్యం నుంచి వచ్చే వలసదారుల విమానాలు పంజాబ్ రాష్ట్రంలోనే ల్యాండింగ్ అవడం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ప్రెసిడెంట్‌గా బాధ్యతలు తీసుకున్న మొదటి రోజు నుంచి ఆయన చాలా విషయాల్లో అగ్రెసివ్‌గా ముందుకెళ్తున్నారు. ముఖ్యంగా అక్రమ వలసదారులపై ఆయన ఉక్కుపాదం మోపుతున్నారు. సంకెళ్లు వేసి మరీ వాళ్లను స్వదేశానికి పంపిస్తున్నారాయన. వలసల విషయంలో మిత్రదేశం భారత్‌తోనూ ఆయన ఇదే పంథాను కొనసాగిస్తున్నారు. యూఎస్‌లో అక్రమంగా నివసిస్తున్న 104 మందిని రీసెంట్‌గా సైనిక విమానంలో ఇండియాకు పంపారు. రెండో విడతగా ఇవాళ మరో 119 మంది ఇక్కడికి రానున్నారు. అమెరికా నుంచి వస్తున్న సీ17 మిలటరీ ఫ్లైట్ శనివారం రాత్రి 10.05 గంటలకు పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ల్యాండ్ అవనుంది. ఇందులో అత్యధికులు పంజాబ్‌కు చెందినవారే కావడం గమనార్హం. 67 మంది పంజాబీలతో పాటు హరియాణాకు చెందిన 33 మంది, గుజరాత్ నుంచి 8 మంది, ఉత్తర్ ప్రదేశ్ నుంచి ముగ్గురు ఉన్నారు. అలాగే మహారాష్ట్ర, రాజస్థాన్‌కు చెందినవారు ఇద్దరు చొప్పున హిమాచల్ ప్రదేశ్, గోవా, జమ్మూ కశ్మీర్‌కు చెందినవారు ఒక్కొక్కరు చొప్పున డిపోర్టేషన్ ఫ్లైట్‌లో ఉన్నారు.



# యోగా లేదా జిమ్..
# ఏది బెస్ట్ ఆప్షన్?



శరీరాన్ని ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉంచుకోవాలనుకుంటే యోగా లేదా వ్యాయామం చేయాల్సిందే.. ప్రస్తుతం ఎక్కువ మంది ఊబకాయం సమస్యతో సతమతమవుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో జిమ్‌లో చెమటలు కక్కుతున్నారు. కొంతమంది వ్యాయామ శిక్షణపై దృష్టి పెడతారు. శారీరక దృఢత్వం, ఆరోగ్యం కోసం వ్యాయామం అనే శారీరక ప్రక్రియను చేస్తారు. ఇలా చేయడం వలన శారీరకంగానే కాదు మనసికమగా కూడా అనేక ప్రయోజనాలను పొందుతారు.మరోవైపు ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలను దూరం చేసుకోవాలనుకునే వారు యోగా, ప్రాణాయామం చేస్తుంటారు. యోగాతో మీరు ఏకాగ్రత నేర్చుకుంటారు. యోగా .. జిమ్ వర్కౌట్‌లలో ఏది బెటర్ అనే ప్రశ్న కొంతమందికి ఎప్పుడూ మనసులో ఉంటుంది. ఈ విషయంపై కల్ట్ ట్రాన్స్‌ఫార్మ్ యోగా ఎక్స్‌పర్ట్ దివ్య రేల్లా అనేక విషయాలను చెప్పారు. ఆరోగ్యంగా ఉండాలంటే శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవడం చాలా అవసరమని చెబుతున్నారు. దీంతో ఊబకాయం, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయి. అంతేకాదు మన శరీరంలోని కండరాలు కూడా ఫ్లెక్సిబుల్‌గా ఉంటాయి. యోగా, జిమ్ వ్యాయామాల మధ్య వ్యత్యాసం ఉంది. ఈ రెండింటి మధ్య తేడా గురించి ముందుగా చెప్పుకుందాం.

**యోగా అంటే ఏమిటి?**


యోగా అనేది భౌతిక భంగిమలు, ధ్యానం, లోతైన శ్వాసలతో కూడిన ఒక పురాతన అభ్యాసం. యోగా అనేది శరీరం, మనస్సు, ఆత్మ ఐక్యంగా ఉండే ఆధ్యాత్మిక ప్రక్రియ. ఈ పదం హిందూమతం, జైనమతం, బౌద్ధమతంలో ధ్యాన ప్రక్రియకు సంబంధించినది. యోగా అనేది సంస్కృత పదం యుజ్ నుండి వచ్చింది. అంటే సేకరించడం లేదా బంధించడం. యోగా ఒక ఆధ్యాత్మిక క్రమశిక్షణ. యోగాలో సూర్య నమస్కారంతో సహా అనేక ఆసనాలు, ప్రాణాయామం ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు గణనీయంగా యోగా పట్ల ఆసక్తిని చూపిస్తున్నారు.

**జిమ్ వ్యాయామం**

జిమ్ గురించి అందరికీ తెలుసు. వ్యాయామశాలలో వివిధ యంత్రాలతో పాటు గాడ్జెట్లను ఉపయోగించి వ్యాయామం చేస్తారు. ఫిట్ , టోన్డ్ బాడీని పొందడానికి చాలా మంది జిమ్‌కి వెళ్తుంటారు. ప్రజలు జిమ్‌కి వెళ్లి కార్డియో, కాళ్లు , వెయిట్ లిఫ్టింగ్ వంటి వివిధ వ్యాయామాలు చేస్తారు.

**రెండింటిలో ఏది మంచిది?**

రెండు ఆరోగ్యానికి మేలు చేసేవే అని యోగా ఎక్స్‌పర్ట్ దివ్య రేలా చెబుతున్నారు. యోగాలో శ్వాస నియంత్రణ అంటే ప్రాణయ, ఆసనం .. యోగా నిద్ర వంటి అంశాలు ఉంటాయి. ఇది శరీరం, మనస్సు రెండింటినీ రిలాక్స్ చేస్తుంది. అదే సమయంలో జిమ్ వ్యాయామంలో శక్తి శిక్షణ ఉంటుంది. ఇది జీవక్రియ. కండరాలకు మంచిది. నిపుణుల అభిప్రాయం ప్రకారం మీ శరీర తత్వాన్ని తెలుసుకోండి. మరింత సౌకర్యవంతంగా ఉన్న వాటిని ఆచరించండి.





# వెజిటేరియన్స్ ఎక్కువగా ఉన్న దేశాలెంటో తెలుసా

కొంతమంది చిన్నప్పటి నుంచీ మాంసాహారులు అయినప్పటికీ.. కారణాలు ఏమైనా కాలక్రమంలో శాకాహారులుగా మారిపోతున్నారు. ఇంకొంత మంది పుట్టినప్పటి నుంచీ శాకాహారులుగా ఉన్నా తదనంతర కాలంలో మాంసాహారులవుతున్నారని అంటుంటారు. ఏది ఏమైనప్పటికీ.. ఎవరు ఎలా మారినప్పటికీ.. శాకాహారం తినడమా, మాంసాహారం తినడమా అనేది పూర్తిగా వ్యక్తిగత ఎంపికనే చెప్పాలి. అయితే ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా చలా మంది ఇప్పుడు శాకాహారాన్ని అవలంభిస్తున్నారని అంటుంటారు. లైఫ్ స్టైల్ ఛేంజ్ లో భాగంగా ఆహారపు అలవాట్లనూ మారుస్తున్నారు. కొంతమంది హెల్త్ కాన్షియస్ కాస్త ఎక్కువగా ఉండి కూడా ఇలాంటి నిర్ణయాలు చేస్తున్నారని చెబుతుంటారు. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా శాకాహారుల సంఖ్య పెరుగుతుందని అంటుంటారు.

**శాకాహారులు ఎక్కువగా ఉన్న టాప్ - 5 దేశాలు...**

**భారతదేశం:**

అత్యధిక సంఖ్యలో శాకాహారం తినేవారు ఎక్కువగా ఉన్న దేశాల్లో అగ్రస్థానంలో ఉంది భారత్. ఇక్కడ ఉన్న జనాభాలో సుమారు 30శాతం మందికి పైగా ప్రజలు శాకాహారమే తింటారని చెబుతున్నారు. ఈ శాతంలో ప్రధాన వాటా హర్యానా, రాజస్థాన్ లలో నివసిస్తున్న ప్రజలని అంటుంటారు!

**ఇజ్రాయెల్:**

ఇజ్రాయెల్ జనాభాలో సుమారు 13 శాతం మంది ప్రజలు శాకాహారులే. మనిషి తన ఆకలిని తీర్చుకోవడానికి జంతువులను చంపడాన్ని సమర్థించలేమని ఇక్కడ నివసించే కొంతమంది ప్రజానీకం బలంగా నమ్ముతారంట.

**తైవాన్:**


శాఖాహర ఆహారాన్ని భుజించే జనాభా ఎక్కువగా ఉన్న దేశాల్లో తైవాన్ మూడో స్థానంలో ఉంది. ఇక్కడున్న మొత్తం జనాభాలో 12 శాతం మంది ఇక్కడ శాకాహారాన్నే అనుసరిస్తున్నారు. ఇక్కడ వెజ్ రెస్టారెంట్స్ చాలానే ఉన్నాయి.

**ఇటలీ:**

ఇటలీ జనాభాలో సుమారు 10 శాతం మంది ప్రజలు వెజిటేరియన్స్. వాస్తవానికి ఇటలీ నాన్ వెజ్ వంటకాలకు ఎక్కువ ప్రసిద్ధి చెందినప్పటికీ.. ఇక్కడ శాకాహారుల సంఖ్య కూడా వేగంగా పెరుగుతోందని తాజా నివేదికలు చెబుతున్నాయి.

**ఆస్ట్రియా:**

ప్రపంచ వ్యాప్తంగా శాకాహర ఆహారాన్ని అనుసరించే వ్యక్తుల విషయంలో ఆస్ట్రియా ఐదో స్థానంలో ఉంది. ఇక్కడ సుమారు 9 శాతం మంది.



# పరగడపున పనీర్ తింటే..
# బోలెడు లాభాలు



చీజ్ అని కూడా పిలువబడే పనీర్, వివిధ రకాల వంటకాలలో ఉపయోగించగల బహుముఖ ప్రయోజనాలు, రుచికరమైన పదార్థం. కానీ., ఉదయాన్నే పనీర్ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని మీకు తెలుసా..? మీ అల్పాహార దినచర్యలో పనీర్ చేర్చడం మీ మొత్తం శ్రేయస్సుకు ప్రయోజనకరంగా ఉండటానికి వివిధ కారణాలను ఒకసారి చూద్దాం.

**ప్రోటీన్ పుష్కలంగా:**

పనీర్ అధిక నాణ్యత ప్రోటీన్ యొక్క గొప్ప మూలం. ఇది మీ రోజును ప్రారంభించడానికి అనువైన ఆహారంగా మారుతుంది. కణజాలాలను నిర్మించడానికి, మరమ్మతు చేయడానికి, అలాగే ఆరోగ్యకరమైన ఎముకలు, కండరాలు, చర్మాన్ని నిర్వహించడానికి ప్రోటీన్ అవసరం.

**జీవక్రియను పెంచుతుంది:**

ఉదయాన్నే పనీర్ తినడం ద్వారా, మీరు మీ జీవక్రియను పెంచుకోవచ్చు. వేగవంతమైన జీవక్రియ బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇంకా రోజంతా మీకు మరింత శక్తిని అందిస్తుంది.

**మీకు కడుపు నిండుగా అనిపించేలా చేస్తుంది:**

పనీర్ అనేది మిమ్మల్ని ఎక్కువ కాలం సంతృప్తిగా, కడుపు నిండుగా ఉండేలా చేయడానికి సహాయపడే ఒక నింపే ఆహారం. ఇది రోజు చివరిలో అనారోగ్యకరమైన ఆహారాలను అతిగా తినడం, అల్పాహారం తీసుకోవడం నివారించవచ్చు.

**అవసరమైన పోషకాలను అందిస్తుంది:**

పనీర్ కాల్షియం, భాస్వరం, విటమిన్ ఎ, బి 12 వంటి విటమిన్లకు మంచి మూలం. బలమైన ఎముకలు, దంతాలు, మొత్తం రోగనిరోధక శక్తిని నిర్వహించడానికి ఈ పోషకాలు ముఖ్యమైనవి.

**రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది:**

ఉదయం పనీర్ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది డయాబెటిస్ లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారికి ముఖ్యమైనది. పనీర్ లోని ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు రక్తప్రవాహంలోకి చక్కెర శోషణను నెమ్మదిస్తాయి.



# భారాస కంటే ఎక్కువ వ్యతిరేకత కాంగ్రెస్‌పైనే ఉంది: కిషన్ రెడ్డి

నల్గొండ: తెలంగాణలో భారాస కంటే ఎక్కువ వ్యతిరేకత కాంగ్రెస్‌పైనే ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. నల్గొండలో పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ పేరుతో ఇచ్చిన హామీని ఇంకా అమలు చేయలేదు. ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. ఇచ్చిన గ్యారంటీలు అమలు చేసే స్తోమత కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు. పలు వర్సిటీలు అప్‌గ్రేడ్ చేస్తామని చెప్పి విస్మరించారు" అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు.



## ఎనిమీ ప్రాపర్టీస్ లెక్క తేల్చండి.. బండి సంజయ్ సమీక్ష

హైదరాబాద్: తెలంగాణలోని ఎనిమీ ప్రాపర్టీస్‌పై కేంద్ర, రాష్ట్ర అధికారులతో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సమీక్ష చేపట్టారు. భారత్ నుంచి వెళ్లి పాకిస్థాన్, చైనాలో స్థిరపడిన వారి ఆస్తులపై అధికారులతో చర్చించారు. మార్చిలోపు ఆస్తుల లెక్క తేల్చాలని ఆదేశించారు. హైదరాబాద్, రంగారెడ్డి, కొత్తగూడెం, వికారాబాద్ జిల్లాల్లో ఎనిమీ ప్రాపర్టీస్‌పై స్పష్టత కోరారు. ఆస్తులు అన్యాక్రాంతం



కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ప్రపంచానికే ఆదర్శంగా ఉండేలా
### ఫ్యూచర్ సిటీ నిర్మిస్తాం : భట్టి

హైదరాబాద్: ఫ్యూచర్ సిటీని నెట్‌జీరో సిటీగా నిర్మించాలనేది ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఐజీబీసీ ఆధ్వర్యంలో నోవాటెల్‌లో నిర్వహిస్తున్న గ్రీన్ తెలంగాణ సమ్మిట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ''ప్రపంచానికే ఆదర్శంగా ఉండేలా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తాం. ప్రభుత్వ అంకితభావం చాటిచెప్పడానికే ఐజీబీసీతో ఫ్యూచర్ సిటీపై ఎంఓయూ కుదుర్చుకున్నాం. రాష్ట్రాభివృద్ధి, అన్ని వర్గాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకునే



ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలు ఉంటాయి. పర్యావరణ పరిరక్షణ కోసం ఇప్పటికే కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెంచేలా మినహాయింపునిచ్చాం. రాష్ట్ర ఆదాయం తగ్గుతుందని తెలిసినా.. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ఈవీ పాలసీ తీసుకొచ్చాం. హైదరాబాద్ నగర మౌలిక సదుపాయాలను మరింత పెంచేలా రూ.10 వేల కోట్లను కేటాయించాం. మూసీ సుందరీకరణ చేపట్టాం. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో స్థిరాస్తి రంగం ఆశించిన స్థాయిలో ఉంది. స్థిరాస్తి వ్యాపారులకు ప్రభుత్వం అండగా ఉంటుంది'' అని భట్టి అన్నారు.

## ఆల్ ఇండియా పోలీస్‌డ్యూటీ మీట్‌లో రాష్ట్ర పోలీసుల ప్రతిభ




68వ జాతీయ పోలీస్ డ్యూటీ మీట్‌లో పతకాలను సాధించిన పోలీస్ క్రీడాకారులను డీజీపీ డాక్టర్ జితేందర్ అభినందించారు. ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో క్రీడా కారుల సమిష్టి కృషి వల్లే ఛాంపియన్‌లుగా నిలిచారని డీజీపీ తెలిపారు. .జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో ఈనెల 10వ తేదీ నుంచి 15 వరకు జరిగిన ఆల్‌ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ క్రీడల్లో తెలంగాణ పోలీసులు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి 18 పతకాలు కైవసం చేసుకున్నారు. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల పోలీసులతో తలపడిన తెలంగాణ పోలీసులు ఛాంపియన్‌షిప్‌గా నిలవడంతో పాటు 6 బంగారు, 4 రజతం, 8 కాంస్య పతకాలను దక్కించుకున్నారు. సాంకేతిక పరిశోధన, విధ్వంసకర ఘటనల తనిఖీ, సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కంప్యూటర్ అవగాహన, డాగ్ స్క్వాడ్ పోటీలతో పాటు డ్యూటీమీట్‌లో తెలంగాణ పోలీసులు ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. శనివారం జరిగిన పోలీస్ డ్యూటీ మీట్ ముగింపు వేడుకలలో జార్ఖండ్ రాష్ట్ర ఆర్థిక మంత్రి రాధాకిషన్ కిషోర్, చీఫ్ సెక్రటరీ, డీజీపీల చేతుల మీదుగా తెలంగాణ టీం మేనేజర్, సీఐడీ ఎస్పీ బి.రామ్‌రెడ్డి ఛాంపియన్ షిప్ ట్రోఫీని అందుకున్నారు.

## మోదీని వ్యక్తిగతంగా అనలేదు.. పుట్టుకతో బీసీ కాదని మాత్రమే చెప్పా: రేవంత్‌రెడ్డి


ఢిల్లీ: తెలంగాణలో కులగణన దేశానికి రోడ్ మ్యాప్ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సుమారు గంట సేపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో సమావేశమైన రేవంత్‌రెడ్డి .. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. భేటీ అనంతరం సీఎం మీడియాతో మాట్లాడారు. ''కులగణన ద్వారా ప్రజాసంక్షేమానికి బాటలు వేస్తున్నాం. కులగణన, ఎస్సీ వర్గీకరణలో తెలంగాణ ఒక రోల్ మోడల్. రాహుల్ గాంధీ చెప్పింది



నేను కచ్చితంగా చేస్తా. రాష్ట్రంలో కులగణన సమగ్రంగా నిర్వహించాం. ఇందులో వెల్లడైన వివరాల ఆధారంగా భవిష్యత్తులో కమిషన్ గాని కమిటీ గాని వేసి ప్రజలకు ఏ విధంగా సంక్షేమ ఫలాలు చేరువ చేయాలనే దానిపై కసరత్తు చేస్తాం. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై కోర్టు ఉత్తర్వుల ప్రకారం నడుచుకుంటాం. ప్రధాని మోదీని వ్యక్తిగతంగా నేను తిట్టలేదు. మోదీ పుట్టుకతో బీసీ కాదని మాత్రమే చెప్పాను. పుట్టుకతో బీసీ కాదు కాబట్టే బీసీల పట్ల ఆయనకు చిత్తశుద్ధి లేదని అన్నాను. నా వ్యాఖ్యలను కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వక్రీకరించారు. మోదీకి చిత్తశుద్ధి ఉంటే జనగణనలో కులగణన కూడా చేయాలి. మంత్రివర్గ విస్తరణపై రాహుల్ గాంధీతో చర్చించలేదు. బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు తెస్తాం'' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## ముగిసిన ఏసీబీ సోదాలు.. గచ్చిబౌలి ఏడీఈ అక్రమాస్తులు రూ.100కోట్ల పైనే

హైదరాబాద్: గచ్చిబౌలిలో విద్యుత్ శాఖ ఏడీఈ సతీశ్‌రెడ్డి రూ.50వేలు లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. దీంతో నిన్నటి నుంచి ఆయన నివాసంతోపాటు వివిధ ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు.






హైదరాబాద్, రంగారెడ్డి, కరీంనగర్ జిల్లాల్లో 22 ఎకరాల వ్యవసాయ భూమి, ఓపెన్ ప్లాట్లు, విల్లా, భవనాలు ఉన్నట్టు గుర్తించారు. స్థిరాస్తుల మార్కెట్ విలువ రూ.100 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏడీఈ నివాసంలో స్థిరాస్తి పత్రాలు, బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నారు. సోదాల అనంతరం సతీశ్‌రెడ్డిని రిమాండ్‌కు తరలించారు. కస్టడీకి తీసుకొని విచారిస్తే మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశముందని భావిస్తున్నారు.

## ముగ్గురు మంత్రులు ఉండి కూడా వేస్ట్...
### రాజీనామా చేయాలి: కవిత

ఖమ్మంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో ఆ పార్టీ ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సేవాలాల్ జయంతి వేడుకలు అధికారికంగా జరుగుతుండటం కేసీఆర్ చలవేనని చెప్పారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత కేసీఆర్ దేనని అన్నారు. కేసీఆర్ రాకముందు పేద ఇంటి ఆడపిల్లకు పెళ్లి చేయాలంటే ఎంతో ఇబ్బంది పడేవారని... కేసీఆర్ వచ్చిన తర్వాత కళ్యాణలక్ష్మి పథకంతో పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లను సులభతరం చేశారని చెప్పారు. ఖమ్మంలో పేరుకే ముగ్గురు మంత్రులు ఉన్నారని... అభివృద్ధిలో మాత్రం వీరు చేసిందేమీ లేదని కవిత విమర్శించారు. అభివృద్ధి చేయలేని ఈ ముగ్గురు మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర రాజకీయాలు చేస్తోందని అన్నారు. ప్రజల అంచనాలకు మించి కేసీఆర్ ప్రభుత్వం పని చేసిందని చెప్పారు. టీడీపీ, బీజేపీ పొత్తులో ఉండటం వల్ల ఏపీకి అన్ని అనుమతులు వస్తు ఈ న్నాయని కవిత అన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్‌కు అనుమతి వస్తే తెలంగాణకు చాలా నష్టమని చెప్పారు. కేంద్రం అనుమతి లేకుండానే ఏపీలో ప్రాజెక్టులు కడుతున్నారని అన్నారు. కళ్ల ముందే నీళ్లు వెళ్లిపోతున్నా... సీఎం సొంత జిల్లాలో ఒక్క తట్ట మట్టి కూడా ఎత్తిపోయలేదని విమర్శించారు. పోలవరం ఏడు మండలాల కోసం తాము ఎంతో పోరాటం చేశామని చెప్పారు.






# చిత్ర పరిశ్రమను ఊపేస్తున్న 'ఛావా'

బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద హిట్ పడి చాలా కాలం అయింది. కొన్నాళ్లుగా సరైన బ్లాక్ బస్టర్ లేక నానా తంటాలూ పడుతూ వచ్చింది. పుష్ప 2 ఇచ్చిన జోష్ తోనే లాగించేస్తోన్న హిందీ సినిమాకు విక్కీ కౌశల్ ఊపు తెచ్చాడు. అతను నటించిన 'ఛావా' బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చుకుంది. రష్మిక మందన్నా ఫీమేల్ లీడ్ గా నటించిన ఈ చిత్రం ఛత్రపతి శివాజీ మహారాజ్ తనయుడు శంభాజీ మహారాజ్ కథతో రూపొందింది. "హిందూ రాజ్య" స్థాపన కోసం కదిలిన శంభాజీ కథగా ఈ చిత్రాన్ని రూపొందించారు. దీనికి తోడు అద్భుతమైన ఎమోషన్స్, యాక్షన్ తో పాటు ఆర్టిస్టుల పర్ఫార్మెన్స్ సినిమాకు బ్లాక్ బస్టర్ టాక్ తెచ్చింది. కేవలం హిందీలోనే ఈ మూవీ ఫస్ట్ డే రికార్డ్ స్థాయి కలెక్షన్స్ సాధించింది. ఓపెనింగ్ డే 32 కోట్లకు పైగా వసూలు చేసింది. ఇది విక్కీ కౌశల్ కెరీర్ లోనే హయ్యెస్ట్ ఓపెనింగ్స్ కావడం విశేషం.

లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వానికి తోడు ఏఆర్ రహమాన్ అద్భుతమైన మ్యూజిక్ సినిమాకు ప్రాణం పోశాయి. రష్మిక శంభాజీ మహారాజ్ భార్య యసూ బాయి గా గొప్ప నటన చూపించింది. పుష్ప 2తో రీసెంట్ గానే బాలీవుడ్ ను మెప్పించిన తనకు ఇది మరో బ్లాక్ బస్టర్ గా నిలవబోతోందనే చెప్పాలి. ఛావా ఓపెనింగ్ జోష్ తో పాటు రివ్యూస్ అన్నీ కూడా పాజిటివ్ గా ఉన్నాయి. విపరీతమైన రేటింగ్స్ కూడా కనిస్తున్నాయి.





# 'ఎన్‌బీకే తమన్'కు పోర్షే కారు గిఫ్ట్..!

టాలీవుడ్ అగ్ర సంగీత దర్శకుడు తమన్‌కు నందమూరి బాలకృష్ణ సర్‌ప్రైజ్ ఇచ్చారు. తమన్ టాలెంట్‌ను అభినందిస్తూ విలువైన బహుమతి ఇచ్చారు. తాజాగా ఖరీదైన పోర్షే కారును కొనుగోలు చేసి తమన్‌కు గిఫ్ట్‌గా ఇచ్చారు. కెరీర్ పరంగా మరెన్నో విజయాలు అందుకోవాలని ఆశీర్వదించారు. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ విషయాన్ని తెలియజేస్తూ హైదరాబాద్‌లోని క్యాన్సర్ ఆస్పత్రిలో ఆంకాలజీ యూనిట్ ప్రారంభోత్సవంలో ఆయన తమన్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "తమన్ నాకు తమ్ముడితో సమానం. వరుసగా నాలుగు హిట్లు ఇచ్చిన తమ్ముడికి ప్రేమతో కారు బహుమతి ఇచ్చాను. భవిష్యత్తులోనూ మా ప్రయాణం ఇలాగే కొనసాగుతోంది" అని అన్నారు. వీరిద్దరి కాంబినేషన్ కు మంచి క్రేజ్ ఉంది. 'డిక్టేటర్', 'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి', 'డాకు మహారాజ్' చిత్రాలకు తమన్ స్వరకర్తగా పని చేశారు. ఆయా చిత్రాల విజయంలో మ్యూజిక్ ప్రత్యేక స్థానాన్ని సొంతం చేసుకుంది. అఖండ సినిమాకు తమన్ ఇచ్చిన బ్యాగ్రౌండ్ స్కోర్‌కు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. గూస్‌బంప్స్ వచ్చేశా తమన్ నేపథ్య సంగీతం అందించారు.

అలా బాలయ్యకు, తమన్‌కు బాండింగ్ కుదిరింది. ఇటీవల డాకు మహారాజ్' ఈవెంట్‌లో తమన్‌ని ఉద్దేశించి బాలయ్య ఆసక్తికర వ్యాఖ్య?ని చేశారు. "నందమూరి తమన్ కాదు.. ఎన్బీకే తమన్" అంటూ తమన్‌కు కొత్త పేరు పెట్టారు. తాజాగా బాలయ్య నటిస్తోన్న 'అఖండ 2' చిత్రానికి కూడా తమన్ స్వరాలు అందిస్తున్నారు.

# గులాబి రంగు చీరలో 'కాంత'




ప్రేమికుల దినోత్సవం సందర్భంగా గులాబీ రంగు చీరలో సింప్లీ సూపర్బ్‌గా కనిపించారు భాగ్యశ్రీ బోర్సే.. దుల్కర్ సల్మాన్ సరసన భాగ్యశ్రీ బోర్సే 'కాంత' అనే చిత్రంలో నటించారు. ఈ చిత్రంలోని పింక్ శారీలో క్యూట్‌గా ఉన్న భాగ్యశ్రీ లుక్‌ని విడుదల చేశారు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ ఈ చిత్రాన్ని నిర్మించారు. "1950ల మద్రాస్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'కాంత'. అప్పటి మానవ సంబంధాలు, సామాజిక సంక్లిష్టతలను ఆవిష్కరించే చిత్రం ఇది. ఈ బహు భాషా చిత్రం షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి" అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం జాను అందించారు.

# రెబెల్ స్టార్ కొత్త చిత్రం అప్డేట్..!

రెబెల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం చేస్తున్న సినిమాలు చాలా ఉన్నాయి, ఇప్పటికే కమిట్ అయిన సినిమాలు చాలానే ఉన్నాయి. అయినా సినిమాలను ఇంకా కొత్తగా కమిట్ అవుతూనే ఉన్నాడు. తాజాగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ఒక సినిమాను చేసేందుకు ప్రభాస్ ఓకే చెప్పాడు. ప్రశాంత్ వర్మ చెప్పిన స్టోరీ లైన్‌కి ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ప్రభాస్ పూర్తి స్క్రిప్ట్ కోసం వెయిట్ చేస్తున్నాడు. స్క్రిప్ట్ వర్క్ దాదాపుగా పూర్తి అయ్యింది. మూడు నెలలుగా తన టీంతో పాటు ప్రభాస్‌కి అత్యంత సన్నిహితులు అయిన ఒకరు ఇద్దరితో కలిసి ప్రశాంత్ వర్మ స్క్రిప్ట్‌ను రెడీ చేస్తున్నారు. త్వరలోనే పూర్తి స్క్రిప్ట్ రెడీ అయితే ప్రభాస్ వద్దకు వెళ్లే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.. ప్రశాంత్ వర్మ ప్రస్తుతం జై హనుమాన్ సినిమాను చేస్తున్నాడు. హనుమాన్ సినిమాకు సీక్వెల్‌గా రూపొందుతున్న జై హనుమాన్ సినిమాను వచ్చే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే విధంగా ప్లాన్ చేస్తున్నారు. అతి త్వరలోనే సినిమా షూటింగ్ ను ముగించి వీఎఫ్ఎక్స్ వర్క్‌కి పంపించే యోచనలో ఉన్నారు. కాంతార స్టార్ రిషబ్ శెట్టి ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపించబోతున్నాడు. అన్ని వర్గాల వారిని ఆకట్టుకునే విధంగా జై హనుమాన్ పాన్ ఇండియా రేంజ్‌లో ఉంటుంది అంటూ ఇండస్ట్రీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. జై హనుమాన్ సినిమా తర్వాత మోక్షజ్ఞతో ప్రశాంత్ వర్మ సినిమా చేయాల్సి ఉన్నా కొన్ని కారణాల వల్ల క్యాన్సల్ అయ్యింది. బాలీవుడ్‌లో ప్రముఖ హీరోతో ప్రశాంత్ వర్మ ఒక సినిమా చేయాల్సి ఉండగా ప్రారంభంకు ముందు క్యాన్సల్ అయ్యింది. ఆ హీరో మరెవ్వరో కాదు.. రణ్వీర్ సింగ్ అనే విషయం తెల్సిందే. స్క్రిప్ట్ విషయంలో విభేదాల కారణంగానే క్యాన్సల్ అయ్యిందని తెలుస్తోంది. తాజాగా మోక్షజ్ఞ సినిమా విషయంలో ఏం జరిగింది అనేది మాత్రం క్లారిటీ లేదు. చివరి నిమిషంలో సినిమా క్యాన్సల్ కావడంతో నందమూరి అభిమానులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో ఇప్పుడు ప్రభాస్ సినిమా అంటూ ప్రచారం జరుగుతుంది, స్క్రిప్ట్ వర్క్ సైతం జరుగుతుంది. ఈ సినిమా అయినా పట్టాలు ఎక్కేనా అంటూ కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కానీ ప్రశాంత్ వర్మ మాత్రం ప్రభాస్‌తో సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాడు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.